తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## రామనామస్మరణతో మార్మోగిన కోదండరామాలయం

### -వార్షిక బ్రహ్మోత్సవాలు ఆరంభం

తిరుపతి, మార్చి 17(ప్రభాతవార్త):



టిటిడికి అనుబంధంగా తిరుపతి కోదండరామస్వామి ఆలయంలో మంగళవారం ఉదయం ధ్వజారోహణంతో వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. భక్తుల రామ నామ స్మరణతో ఆలయం మార్మోగింది. కంకణబట్టార్ భరత్ కుమార్ దీక్షి తులు ఆధ్వర్యంలో ధ్వజారోహణ ఘట్టాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం 9 గంటలకు ఆస్థానం నిర్వహించారు. రాత్రి 7 గటంలకు పెద్దశేష వాహన సేవ మాఢవీధుల్లోఊరేగింది. ఈ కార్యక్రమంలో పెద్దజీయర్‌స్వామి, ఆలయ డిప్యూటీ ఈఓ నాగరత్న, ఆలయ ఇన్‌స్పెక్టర్ సురేష్, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

## మహాయజ్ఞంలా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

తిరుమల, మార్చి 17(ప్రభాతవార్తప్రతినిధి:



తెలుగు నూతన సంవత్సరం "పరాభవనామ" ఉగాది పర్వదినం పురస్కరించుకుని మంగళవారం ఉదయం ఆలయంలో శాస్త్రోక్తంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించారు. టిటిడి పాలకమండలి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, బోర్డు సభ్యులు భానుప్రకాష్‌రెడ్డి, సి.దివాకర్‌రెడ్డి, ఎంఎస్ రాజు, శాంతారామ్, నన్నపనేని సదాశివరావు, టిటిడిఅదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, సివిఎస్‌ఓ మురళీకృష్ణ, ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం, ఆలయఅర్చకులు, ఉద్యోగులు పాల్గొని సుగంధపరిమళ ద్రవ్యంతో శుద్ధి చేశారు.

### వంట గ్యాస్

## సిలెండర్ల కోసం పాట్లు

**- గ్యాస్ కొరత లేదంటున్న అధికారులు**
**- రీఫిల్లింగ్ బుకింగ్ కోసం పని చేయని ఫోన్ నెంబర్లు**

చిత్తూరు, మార్చి 17 ప్రభాతవార్త:

జిల్లాలో వంట గ్యాస్ కష్టాలు ఎక్కువ అవుతున్నాయి. డొమెస్టిక్ సిలెండర్లను సైతం గ్యాస్ ఏజెన్సీలు సకాలంలో రీఫిల్లింగ్ చేపట్టకపోతుండటంతో వినియోగదారుల్లో ఆందోళన చెందుతున్నారు. మరోవైపు కమర్షియల్ సిలెండర్ల రీ-ఫిల్లింగ్ లేకపోవడం, ఇప్పటి వరకు వాణిజ్య అవసరాలకు సైతం హోటల్, టీ, ఇతర దుకాణాల్లో డొమెస్టిక్ సిలెండర్లను ఉపయోగిస్తుండటం, ఇప్పుడు ఇళ్ళ అవసరాలకే గ్యాస్ ఏజెన్సీలు వినియోగదారులకు డొమెస్టిక్ సిలెండర్లు అందించకపోవడంతో డొమెస్టిక్ సిలెండర్ల రీ-ఫిల్లింగ్‌కు తీవ్ర డిమాండ్ ఏర్పడింది. జిల్లాలో ఇప్పటికే అత్యధిక సంఖ్యలో హోటళ్ళు, చిన్న టీ దుకాణాలు, గ్యాస్ వినియోగించి నడిచే ఇతర వ్యాపారాలు స్తంభించిపోయాయి. కొన్ని గ్యాస్ ఏజెన్సీలు వాణిజ్య అవసరాలకు సైతం డొమెస్టిక్ సిలెండర్లను బ్లాక్ మార్కెట్‌లో విక్రయించి భారీగా సొమ్ము చేసుకుంటున్నారు. ప్రస్తుతం వాణిజ్య అవసరాల కోసం కొన్ని గ్యాస్ ఏజెన్సీలు ఒకొక్క సిలెండర్ రీ-ఫిల్లింగ్ కోసం హోటల్ యాజమానుల నుండి రూ.1,500 మేరకు వసూలు చేస్తున్నాయి. ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధం ప్రారంభం కావడంతో గ్యాస్ కష్టాలు ప్రారంభం అయ్యాయి. అప్పటి వరకు గ్యాస్ బుకింగ్‌తో నిమిత్తం లేకుండా వినియోగదారులకు సిలెండర్ రీఫిల్లింగ్ చేసే ఏజెన్సీలు గత నెల రోజులుగా రీఫిల్లింగ్ కోసం బుక్ చేసి ఓటిపి చెపితే కాని గ్యాస్ సిలెండర్ రీ-ఫిల్లింగ్ చేయని పరిస్థితి ఏర్పడింది. ఓ వైపు జిల్లా అధికారులు జిల్లాలో ఎక్కడ గ్యాస్ కొరత లేదని డొమెస్టిక్ సిలెండర్లు రీఫిల్లింగ్ చేయడానికి రెండు రోజుల సమయం మాత్రమే పడుతుందని పేర్కొంటున్నప్పటికీ వాస్తవ పరిస్థితులు మాత్రం ఇందుకు భిన్నంగా వుంటున్నాయి. వినియోగదారులు గ్యాస్ బుకింగ్ కోసం ఫోన్ చేస్తే ఆ ఫోన్లు పని చేయని పరిస్థితి నెలకొంది. మరోవైపు ఏజెన్సీల వద్ద గ్యాస్ స్టాక్ ఎప్పుడు వుంటుందో! ఎప్పుడు అయిపోతుందో! తెలియని పరిస్థితి నెలకొంది. గ్యాస్ రీఫిల్లింగ్ కోసం బుకింగ్ చేసి పది రోజులు కావస్తున్నప్పటికీ ఇప్పటి వరకు గ్యాస్ రీఫిల్లింగ్ చేయని పరిస్థితి జిల్లాలో నెలకొంది. అంటే జిల్లాలో వంట గ్యాస్ కొరత తీవ్ర రూపం దాల్చిందనే విషయం స్పష్టమవుతుంది. మరోవైపు వాణిజ్య అవసరాల కోసం విక్రయించి వాణిజ్య సిలెండర్లు జిల్లాలో అందుబాటులో లేకపోవడంతో హోటల్ యాజమానులు, టీ దుకాణ నిర్వాహకులు సైతం వినియోగదారులు ఉపయోగించే డొమెస్టిక్ సిలెండర్ల కోసం వెంపర్లాడుతున్నారు. కొంతమంది గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులతో లింకులు పెట్టుకుని బ్లాక్ మార్కెట్‌లో డొమెస్టిక్ సిలెండర్లను రీఫిల్లింగ్ చేసుకుని వ్యాపారం చేసుకుంటుంటే మరికొంతమంది వినియోగదారులు బుక్ చేసిన రీ ఫిల్లింగ్ సిలెండర్లను బ్లాక్ మార్కెట్‌లో కొనుగోలు చేసి వ్యాపారం నిర్వహించుకుంటున్నారు.

## గంజాయి గమ్మత్తు!

**గంగవరం పరిసరాల్లో మత్తులో బీభత్సం**
**పోలీసువాహనంతో పరారై చెమటలు పట్టించిన కర్నాటకవాసి**



ధ్వంసమైన పోలీసు వాహనం



తీవ్రంగా గాయపడ్డ ఆటో డ్రైవర్ బాలాజీ,



పోలీస్ స్టేషన్ ఎదురుగా ధ్వంసమైన కారు



ఆగంతుకుడిని తాళ్ళతో బందిస్తున్న పోలీస్,అగ్నిమాపక సిబ్బంది.

గంగవరం, మార్చి 17, ప్రభాతవార్త :

గంజాయి సేవించిన మత్తులో ఓ యువకుడు మతిస్థిమితం కోల్పోయి బీభత్సం సృష్టించాడు. అడ్డొచ్చిన ప్రజలపై దాడిచేసి గాయపరచడమేగాక ఏకంగా పోలీస్ రక్షక్ వాహనంలో డ్రైవర్‌ను గాయపరచి క్రిందపడేసి ఆ వాహనంలో సైరన్‌తో పరుగులుతీశాడు. ఈ సంచలన సంఘటన చిత్తూరు జిల్లా గంగవరం మండలం పరిసర ప్రాంతాల్లో మంగళవారం ఉదయం చోటుచేసుకుంది. జరగాల్సిన నష్టం...పలు వాహనాల ప్రమాదాలు, సర్కస్‌ఫీట్ల తరువాత పోలీసులు ఆలస్యంగా స్పందించి ఆ గంజాయి గమ్మత్తు యువకుడిని అదుపులోకి తీసుకోవడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. ఏకంగా కొన్నిగంటలపాటు కర్నాటక యువకుడు గంగవరం మండలం పోలీసులను పరుగులుతీయించడమేగాక పోలీస్ వాహనంతో ఉడాయించి వారికి చెమటలు పట్టించాడు. మంగళవారం ఉదయం చోటుచేసుకున్న ఈ విపత్కర సంఘటనకు దారితీసిన పరిస్థితులు.....కర్ణాటక రాష్ట్రం బెంగళూరు యలహంక సమీపంలోని మారసంద్రకు చెందిన మునిరాజ్ కుమారుడు రత్నాకర్(40) ఓ వాహనం డ్రైవర్‌గా ఉంటూ అక్కడి పాఠశాలలకు విద్యార్థులను తీసుకెళ్ళేవాడు. కట్టుకున్న భార్యపై అనుమానం పెనుభూతంగా మారడంతో ఆమెపై కోపంతో, విరక్తితో సోమవారం రాత్రి బెంగుళూరులో ఇంటి నుండి వచ్చేశాడు. మంగళవారం ఉదయం ఎలాగో గంగవరం చేరాడు. అప్పటికే అతను గంజాయి సేవించిన మత్తులో మతిస్థిమితం కోల్పోయాడు. ఎటు వెళ్ళాలో తెలియని దుస్థితిలో మంగళవారం ఉదయం సుమారు 6 గంటల ప్రాంతంలో గంగవరం సమీపంలోని పంట పొలాల వద్దకు చేరాడు..అక్కడ పొలం పనులు చేసుకుంటున్న మహిళలు, రైతులు, వ్యవసాయ కూలీల పట్ల బేతాళుడి వేషంలో ప్రవర్తించాడు. సమీపంలోని గంగమ్మ ఆలయంలో త్రిశూలం తీసుకుని కొందరిపై దాడికి దిగాడు. అక్కడ కొందరు అతనిని తరిమి వేశారు. అక్కడి నుండి కొంతసమయం తరువాత గంగవరం పెద్ద చెరువు సమీపంలోని వ్యవసాయ పొలాల్లో పంటను ధ్వంసం చేస్తూ , పొలాల్లో పనులు చేసుకుంటున్న వారిపై దాడికిదిగాడు. అప్రమత్తమైన కొందరు యువకులు పోలీసులకు సమాచారమిచ్చారు. యువకులపై తిరగబడి పెద్ద చెరువులోకి దూకేశాడు .గంటకు పైగా చెరువులో ఉండి దర్గా వద్దకు చేరుకున్నాడు. దాడులకు దిగడంతో స్పందించిన పోలీసులు పోలీసు పెట్రోల్ వాహనంతో ఒక కానిస్టేబుల్‌ను పంపారు. అతడినిపట్టుకునే ప్రయత్నంలో బండరాయితో కానిస్టేబుల్ తలపై బాది కిందకు తోశాడు. క్షణాల్లో పోలీసు వాహనంతో ఉడాయించాడు. పోలీస్ స్టేషన్ వద్ద ఎదురుగా వస్తున్న కారును వేగంగా డీకొన్నాడు. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఆ తరువాత గంగవరం వంతెన వద్ద టమోటాలు తరలిస్తున్న ఆటోను డీకొన్నాడు. ఆటో డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. ప్రమాదంతో పోలీసు వాహనం ధ్వంసం కావడంతో వదలిపెట్టేశాడు. అక్కడే చిగారాజుపల్లి చెరువులోనికి దూకేశాడు. అప్పటికే సమాచారం తెలుసుకుని పలమనేరు సిఐ మోహన్‌రెడ్డి,, ఎస్ఐ లోకేష్‌రెడ్డి తమ సిబ్బందితో చెరువు వద్దకు చేరుకున్నారు. అగ్నిమాపక సిబ్బంది సహాయంతో అతనిని త్రాళ్ల సాయంతో అదుపులోకి తీసుకున్నారు. 108లో పలమనేరు ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటనలో పోలీసుల తప్పిదం, నిర్లక్ష్యంతోనే గంజాయిమత్తులో వీరంగం చేయడం, ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడం జరిగిందని మండలప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు.

## గ్యాస్ సంక్షోభం ఎదుర్కొవడానికి ముందస్తు చర్యలు

**- గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకుల ద్వారా జిల్లా యంత్రాంగానికి ప్రతిపాదనలు**
**- కాణిపాకం పాలకమండలి ఏకగ్రీవ తీర్మానం - పూతలపట్టు ఎమ్మెల్యే, ఆలయ ఛైర్మన్, ఇఓల వెల్లడి**



కాణిపాకం, మార్చి 17 ప్రభాతవార్త:

కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో అవసరమైన గ్యాస్ సిలెండర్ల కొరత లేకుండా అన్ని ముందస్తు చర్యలు చేపట్టాలని దేవస్థానం పాలకమండలి ఏకగ్రీవంగా తీర్మానించింది. స్థానిక ఇఓ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం ఇటీవల నెలకొన్న గ్యాస్ సంక్షోభం నేపథ్యంలో ఆలయ ఛైర్మన్ మణినాయుడు అధ్యక్షతన పాలకమండలి అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను ఆలయ ఛైర్మన్ మణినాయుడు ఇఓ పెంచల కిషోర్‌లతో కలిసి ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ విలేకరులకు వివరించారు. ఈ సందర్భంగా దేవస్థానంలో ప్రతిరోజు 3,500 మంది నుండి 5 వేల మంది భక్తుల వరకు ఉచిత అన్న ప్రసాదాలను అందించడంతో పాటు భక్తులకు అవసరమైన లడ్డూ, వడ ప్రసాదాల తయారీ, స్వామి వారికి నిత్య నైవేద్యం వంటివి కూడా గ్యాస్ ఆధారంగానే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు 19 కేజీల గ్యాస్ సిలెండర్లు నెలకు 270 సిలెండర్ల వరకు అవసరం వున్నాయని, 45.7 కేజీల గ్యాస్ సిలెండర్లు రోజుకు 2 నుండి 3 వరకు అవసరం వున్నట్లు తెలిపారు. గ్యాస్ సంక్షోభం నేపథ్యంలో 19 కేజీల సిలెండర్‌పై రూ.110, 47.5 కేజీల సిలెండర్‌పై రూ.300 ధరలు పెరిగి అదనంగా దేవస్థానంపై భారం పడుతున్నట్లు తెలిపారు. అయినప్పటికీ గ్యాస్ సిలెండర్ల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని సమావేశంలో నిర్ణయించినట్లు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ తెలిపారు. అప్పటికే రాష్ట్రంలోని పలు ఆలయాల్లో గ్యాస్ కొరత కారణంగా కట్టెల పొయ్యి ద్వారా భక్తులకు అన్నప్రసాదాలు, లడ్డూ, వడ ప్రసాదాలు, స్వామి వారికి నైవేద్య ప్రసాదాలను తయారు చేస్తున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో కాణిపాకం దేవస్థానంలో అలాంటి పరిస్థితి తలెత్తకుండా అవసరమైన 47.5 కేజీల సిలెండర్లు 50 వరకు, 19 కేజీల సిలెండర్లు 100 నుండి 150 వరకు రిజర్వ్‌లో వుంచుకోవాలని సమావేశం తీర్మానించింది. ఇందుకు అవసరమైన సిలెండర్లను ఏజెన్సీల ద్వారా అందించడానికి జిల్లా యంత్రాంగానికి ప్రతిపాదనలు పంపాలని సమావేశంలో తీర్మానించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. అలాగే దేవస్థానం ఉభయదారుల కమిటీ ఛైర్మన్ దివంగత ఈశ్వర్‌బాబు అలియాస్ బుజ్జినాయుడు మృతికి తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తూ తీర్మానించడంతో ఆయన మృతికి మౌనం పాటించారు. అలాగే సుదీర్ఘకాలంగా పరిష్కారం కాకుండా వున్న దళిత సత్రం కేటాయింపు విషయమై వచ్చే సమాచేశంలో నిర్ణయం తీసుకుని సమస్యను పరిష్కరించాలని సమావేశంలో తీర్మానించారు. ఈ సమావేశంలో డిప్యూటీ ఇఓ సాగర్‌బాబు, పాలకమండలి సభ్యులు చంద్రశేఖర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, నరేష్, శివప్రసాద్, సునీత, అనసూయ, ఇఇ వెంకటనారాయణ, ఎఇఓలు ఎస్వీ కృష్ణారెడ్డి, హరిమాధవరెడ్డి, ధనంజయ, ప్రసాద్, సిఎఫ్ఓ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### నగరపాలకలో

## పోటాపోటీగా టెండర్లు

**-బలమున్నవాడిదే హక్కులు**
**-రూ.4.14 కోట్లుకు కూరగాయల మార్కెట్ కైవశం**



తిరుపతి, మార్చి 17(ప్రభాతవార్త:

తిరుపతి నగరపాలకసంస్థలో పలు రకాల టెండర్లు దక్కించుకునేందుకు జరిగిన వేలం పాటలో పోటాపోటీగాపలువురు పాల్గొన్నారు. ఈ టెండర్లను అమాంతం చేజిక్కించుకునే స్థాయిలో భారీగా ఆదాయం సమకూరేలా మారింది. మంగళవారం సాయంత్రం 2026-27 సంవత్సరానికి జరిగిన టెండర్లలోఇందిరా ప్రియదర్శిని కూరగాయల మార్కెట్‌ను వేలం పాటలో 4.14 కోట్లకు చేజిక్కించుకున్నారు. నగరపాలక సంస్థ పరిధిలో ఇందిరా ప్రియదర్శిని కూరగాయల మార్కెట్, రామచంద్ర గుంట కట్టపై ఉన్న పట్నాలు వీధి కూరగాయల మార్కెట్ కు, జంతు వధశాలకు, గాంధీ రోడ్డు, తిలక్ రోడ్డు, మాస్కు రోడ్డు, త్యాగరాజ మండపం, దేవేంద్ర థియేటర్ రోడ్డు, కేటి రోడ్డు ,హరే రామ హరే కృష్ణ రోడ్డు ఇరువైపులా, కపిల తీర్థం రోడ్డు జంక్షన్ పార్కింగ్, శ్రీనివాసం పక్కన పార్కింగ్ స్థలాలకు, గోవిందరాజ దక్షి ణ, ఉత్తర మాడా వీధుల పార్కింగ్ స్థలాల లీజుకు మంగళవారం సీల్డు టెండర్లు, బహిరంగ వేలం నిర్వహించినట్లు కమిషనర్ మౌర్య తెలిపారు. ఇందిరా ప్రియదర్శిని కూరగాయల మార్కెట్ వేలంలో వై.గీత 4.14 కోట్ల రూపాయల హెచ్చు పాటతో దక్కించుకున్నారు. రామచంద్రగుంట కట్ట పట్నం వీధి కూరగాయల మార్కెట్‌ను ముని రాజబాబు 3.30 లక్షల రూపాయల హెచ్చు పాటతో దక్కించుకున్నారు. జంతు వధశాలను వి.గణేష్ 5.85 లక్షలు హెచ్చు పాటతో దక్కించుకున్నారు. గాంధీ రోడ్డు, తిలక్ రోడ్డు, మాస్క్ రోడ్డు, త్యాగరాజ మండపము, దేవేంద్ర థియేటర్ రోడ్డు, కె.టి. రోడ్డు, హరే రామ హరే కృష్ణ రోడ్డుకు ఇరువైపులా, కపిల తీర్థం రోడ్డు జంక్షన్ల యందు పార్కింగ్ వసూలు చేయుటకు నిర్వహించిన వేలంలో వి. గణేష్ 50.74 లక్షల రూపాయల హెచ్చు పాట పాడి దక్కించుకున్నారు. శ్రీనివాసన్ పక్కనగల పార్కింగ్ స్థలము లో రుసుము వసూలుకు బాలాజీ 19.11 లక్షల రూపాయల హెచ్చు పాట పాడి దక్కించుకున్నారు. గోవిందరాజ ఉత్తర, దక్షి ణ మాడ వీధుల్లో పార్కింగ్ రుసుము వసూలుకు రాధ 12.39 లక్షల రూపాయల హెచ్చు పాట పాడి దక్కించుకున్నారని తెలిపారు. వేలం పాటలో హెచ్చు పాట పాడి మార్కెట్, తదితరాలను దక్కించుకున్న వారు నగరపాలక సంస్థ నియమనిబంధనలను తప్పక పాటించాలని కమిషనర్ తెలిపారు. ఈ వేలం పాటలో ట్రైనీ కలెక్టర్ రఘువంశీ, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, రెవిన్యూ అధికారులు సేతు మాధవ్, రవి పాల్గొన్నారు.

### సత్యవేడు నియోజకవర్గం టిడిపిలో

## ఆధిపత్య పోరు

**అధికారులకు, తమ్ముళ్ళకు**
**పార్టీ కో-ఆర్డినేటర్ రక్త సంబంధికుల పోటు**



తిరుపతి, మార్చి 17 ప్రభాతవార్త:

సత్యవేడు నియోజకవర్గంలో కో-ఆర్డినేటర్ శంకర్‌రెడ్డి తమ్ముడు మురళీరెడ్డి మేనల్లుడు మోహన్‌రెడ్డి, వైసీపీ పార్టీ నుంచి వచ్చిన కూరపాటి చంద్రశేఖర్‌రెడ్డి ఆధిపత్య పోరుతో అధికారులను, తమ్ములను నలిపేస్తున్నట్టు ఆవేదన వెళ్ళగకుతున్నారు. సత్యవేడు నియోజకవర్గం కో-ఆర్డినేటర్ శంకర్‌రెడ్డి ఇంటి పేరు కూరపాటి కావడంతో సత్యవేడు వైసీపీ పార్టీ నుంచి వచ్చిన చంద్రశేఖర్‌రెడ్డి ఇంటి పేరు కూడా కూరపాటి రావడం అధికారులను బయపెట్టడానికి ఓ దశలో చంద్రశేఖర్‌రెడ్డికి కలసి వచ్చిందని పలువురు విశ్లేషించుకుంటున్నారు. శంకర్‌రెడ్డి పూర్తి బాధ్యత వైసీపీ నుంచి వచ్చిన చంద్రశేఖర్‌రెడ్డికే అప్పగించారని అధికారులతో చరవాణి ద్వారా, కొన్ని సందర్భాల్లో భయపెడుతున్నట్లు అధికారులు బహిరంగం పేర్కొంటున్నారు. దీంతో అధికారులు అటు తెలుగుదేశం పార్టీ నుంచి సస్పెండ్ అయిన సత్యవేడు నియోజకవర్గ ఎమ్మెల్యే ఆదిమూలం మాటలకు ప్రాధాన్య ఇవ్వాలా..లేక కో-ఆర్డినేటర్ శంకర్‌రెడ్డికి ప్రాధాన్యత ఇవ్వాలా అంటూ తలలు పట్టుకుంటున్నారు. ఇవన్నీ ఒక ఎత్తు అయితే శంకర్‌రెడ్డి రక్తసంబంధీకులు తహసీల్దార్‌ని, ఇద్దరు కాకీలను ఉన్న ఫలంగా స్థానచలన చేశాం, ఎవరిని ఉపేక్షించేది లేదు అనడం పట్ల తమ్ముళ్ళకు ఏమి చేయాలో అర్థం కాక రాజకీయ స్వస్తిగా మారిందంటున్నారు. దీంతో అధికారులు, తమ్ముళ్ళకు మరింత సత్యవేడు మండలంలో మట్టి మాఫియాతో కుమ్మకు అయి ఎన్నడూ లేని విధంగా గ్రావెల్ కంకర, మట్టి క్వారీలు మత్తులో పడి అధికారులను, పోలీసు వ్యవస్థ చేతిలో పెట్టుకుని అటు ప్రజలను ఇబ్బంది పెడుతూ దోచిన కాడికి దోచేస్తున్నారని తమ్ములే బహిర్బాటంగా మాట్లాడుతున్నారు. గత ప్రభుత్వం కంటే విచ్చలవిడిగా మట్టి దోచేస్తు పల్లెలకు వేలే రహదారులు జడేరి, రాజగుంట, కన్నవరం, గోలవారి కండ్రిగ, పీవీ పురంరోడ్లు పూర్తిగా ధ్వంసం చేసేశారు. దీంతఓ పార్టీకి చెడ్డ పేరు వస్తుందని గ్రహించి పార్టీ కోసం కష్టపడిన సీనియర్‌నాయకులు అందరూ కనుమరుగై తమ రాజకీయ భవిష్యత్‌ను మౌన ప్రదర్శిస్తున్నారు. ఇటు శంకర్‌రెడ్డి తనయుడు మురళీరెడ్డి మేనల్లుడు మోహన్‌రెడ్డి, వైసీపీ నుంచి వచ్చిన చంద్రశేఖర్‌రెడ్డి ఫోటోలను ఫ్లెక్సీలో పెట్టకుంటే అక్కడ తెలుగుదేశం పార్టీ నాయకులకు రాజకీయం శూన్యమనట్టే ఇలాంటి ఫ్లెక్సీలు చూసి తెలుగు తమ్ముళ్లు పార్టీ కార్యక్రమాలకు దూరంగా మౌన ప్రదక్షిణ చేస్తున్నారు. ఇకనైనా అధిష్టానం నియోజకవర్గంలో జరుగుతున్న రాజకీయాలపై దృశ్య సాధించే శేఖర్‌రెడ్డి కుటుంబ రాజకీయాలను అరికట్టి తెలుగు తమ్ముళ్ళకు న్యాయం చేస్తారని కొందరు సీనియర్ నాయకులు బహిరంగ పేర్కొంటున్నారు.

## టైరు పేలి కారు బోల్తా .. ఒకరు మృతి

చంద్రగిరి, మార్చి 17 ప్రభాతవార్త:

కారు పేలి కారు బోల్తా పడిన దుర్ఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్రగాయాలపాలైన సంఘటన మంగళవారం చం ద్రగిరి-అగరాల మధ్యన బైపాస్‌లో చోటుచేసుకున్నది. ఎస్ఐ మురళీమోహన్ అందించిన వివరాల మేరకు.. చిత్తూరు జిల్లా, బంగారుపాళ్యం మండలం, గుంతూరు గ్రామానికి చెందిన నరేంద్ర నాయుడు (48), సురేంద్ర నాయుడు కారులో తిరుపతికి బయలుదేరారు. చంద్రగిరి సమీపంలో వస్తుండగా కారు ముందు భాగంలోని ఎడమవైపు టైరు పేలిపోయింది. దీంతో కారు అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలపాలైన నరేంద్ర నాయుడు, సురేంద్ర నాయుడులను 108 ద్వారా ఆసుపత్రికి తరలించగా ఇద్దరినీ పరీక్షించిన వైద్యులు నరేంద్ర నాయుడు అప్పటికే మృతి చెందినట్లు ధృవీకరించారు. సురేంద్ర నాయుడు వైద్య చికిత్సలు పొందుతున్నాడు.

### అదనపు గ్రాంటు ఆమోదం వచ్చింది... కాస్త ఆగండి...!

24న వేతనాలు చెల్లిస్తామన్న ఎస్వీయూ అధికారులు

నిరసన విరమించుకున్న ఉద్యోగులు



5లో

## స్వర్ణముఖి నదిపై ఆక్రమణల దండయాత్ర

### -బహిరంగంగా అధికారుల నిర్లక్ష్యం ప్రస్ఫుటం

తిరుపతి, మార్చి 17 ప్రభాతవార్త:



తిరుపతిరూరల్ మండలంలో స్వర్ణముఖి నది ఆక్రమణల బారినపడుతున్న పరిస్థితి ఆందోళనకరంగా మారింది. ఇప్పటికే మండలంలో డికెటి, అనాధీనం, కాలువలు, కశంగడ్డలు అన్యాక్రాంతమయ్యాయి. ప్రస్తుతం స్వర్ణముఖి నదిపై ఆక్రమణదారుల కన్నుపడింది. దర్జాగా స్వర్ణముఖి నదిని పూడ్చేసి, ఆక్రమణలు జరుగుతూ ఉన్నా...ఇటు ఇరిగేషన్ అధికారులు గానీ..అటు రెవెన్యూ అధికారులు గాని పట్టించుకోకపోవడం విచారకరం. తనపల్లి, కుంట్రపాకం ప్రధాన రహదారి... అవిలాల లెక్కదాఖల సర్వేనెంబర్ 360 పరిధిలో నదిని పూడ్చివేస్తూ భూభాగంగా మార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.

**నదిని మాయం చేస్తూ దర్జాగా పనులు**

స్థానికులు తెలిపిన వివరాల మేరకు జెసిబిలు, ట్రాక్టర్లుతో నదిలో మట్టినింపడం, చెత్తను పారబోసి, నోటి ప్రవాహాన్ని అడ్డుకోవడం బహిరంగంగానే జరుగుతోంది. రోజురోజుకు నది పరిమాణం తగ్గుతూ ఉండగా, కొంతమంది ఆక్రమణదారులు దానిని స్థిరభూమిగా మార్చే ప్రయత్నాలు చేస్తున్నారని చెబుతున్నారు.

**అధికారులపై తీవ్ర విమర్శలు**

ప్రధాన రహదారి పక్కనే స్వర్ణముఖిని పూడ్చిస్తుంటే ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు ఏమి చేస్తున్నారని...ఆయా శాఖల నిర్లక్ష్యం స్పష్టంగా కన్పిస్తుందని ప్రజలు మండిపడుతున్నారు. నదిలో పనులు జరుగుతున్నా...ఫిర్యాదులు చేస్తున్నా...స్పందన లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## ప్రభుత్వవిప్ డాక్టర్ కంచర్లచే మధ్యాహ్నభోజనం తనిఖీ

కుప్పం, మార్చి 17 ప్రభాతవార్త



రాష్ట్ర విద్యాశాఖ మ ంత్రి నారా లోకేష్ ఆదేశాల మేరకు మంగ ళవారం మండలంలోని నడి మూరు హైస్కూల్‌లో ప్రభు త్వవిప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ ఆకస్మిక తనిఖీ నిర్వహిం చారు. ఈసందర్భం గా పాం శాల రికార్డులు పరిశీలించారు. విద్యార్థినీ విద్యార్థులతో మా ట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులకు అమలు చేస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ ్న భోజనాన్ని తానే స్వయంగా విద్యార్థులతో పాటు తిని రుచి చూశారు. విద్యార్థులకు ఎలాంటి సమస్యలు వచ్చినా వెంటనే వాటి పరిష్కారంకు తగు చర్యలు తీసుకుం టామన్నారు. ఉపాధ్యాయులు పిల్లలకు నాణ్యమైన విద్యను అందించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు.



## సెట్విన్ సౌజన్యంతో కెరీర్ డెవలప్‌మెంట్‌పై అవగాహన

**శ్రీకాళహస్తి, మార్చి 17 ప్రభాతవార్త** శ్రీకాళహస్తిలోని శ్రీ విద్యాప్రకాశానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం సెట్విన్ సారధ్యంలో కెరీర్ డెవపల్‌మెంట్‌పై విద్యార్థులకు అవగాహన సదస్సు ను నిర్వహంచారు. డిగ్రీ చదువుతున్న విద్యార్థులకు వ్యక్తిత్వ వికాశం, కెరీర్ డెవలప్‌మెంట్ అనే అంశంపై కళాశాల కెరీర్ గైడెన్స్ సెల్ అధ్వర్యంలో తిరుపతి జిల్లా సెట్విన్ వారి సౌజన్యంతో అవగాహన కార్యక్ర మాలను ఏర్పాటు చేసారు. కళాశాల ప్రిన్సి పల్ డాక్టర్ కె. నరసింహా వర్మ కార్యక్రమాలకు అధ్యక్షత వహిం చారు. ఈ సందర్బంగా మాట్లాడుతూ విద్యార్థులకు వ్యక్తిత్వ వికాశంతో పాటు భవిష్యత్తు కార్యచరణ క్రమ బద్దంగా ప్రణాళికా బద్దంగా రూపొందించుకుంటే అదే విజయానికి సోపానమౌతుందన్నారు. ఈ కార్యక్ర మాల్లో సెట్విన్ తిరుపతి జిల్లా సిఇఓ కె. మోహన్, విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, పాజిటివ్ థింకింగ్, లక్ష్య నిర్దేశం, నైపుణ్యాభివృద్ధి వంటి అంశాలకు సంబంధించి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమాల్లో కెరీర్ గైడెన్స్ మోటివేటర్ ఎన్ ఎస్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో అందు



బాటులో ఉన్న ఉద్యోగవకాశాలను వివరించారు. కళాశాల కెరీర్ గైడెన్స్ కళాశాల కన్వీనర్ డాక్టర్ రమేష్ బాబు, డాక్టర్‌వి. మునెయ్య, డాక్టట్ సతీష్, డాక్టర్ సాయివెంకటేష్, రామసుంకన్న తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు అన్నదానం

శ్రీకాళహస్తి, మార్చి 17 ప్రభాతవార్త

వైకాపా బియంఆర్ సైనికుడు జి. విజయకుమా ర్‌రెడ్డి మంగళవారం పేదలకు అన్నదానం జరిపారు. మాజీ శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి కుటుంబానికి అత్యంత విశ్వా సంతో పని చేస్తున్న జివికె రెడ్డి ఆకాష్‌రెడ్డి జన్మ దిన సందర్బంగా పేదలకు అన్నదానం అందిం చారు. ఆయన భోజనం పాకెట్లును తయారు చేసి నిరుపేదలకు అందించారు.

## భక్తకన్నప్ప 46వవార్షికోత్సవం

శ్రీకాళహస్తి, మార్చి 17 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలోని తేరువీధిలో వెలసిన భక్తకన్నప్ప కమిటి 46వ వార్షికోత్స వం సందర్బంగా పలు సామాజిక కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు కమిటి ప్రకటించింది. గత కొన్ని సంవత్స రాలుగా ఈ ఆలయానికి దేవస్థానం ఉగాది సందర్బంగా పలు ధార్మిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. తెలుగుసంవత్స రాది యుగాది సందర్బంగా ఈ నెల 19న ఉదయం పూజా కార్యక్రమాలతో ప్రారంభమౌతాయని వివరించారు. శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి, రాష్ట్ర బిజెపి ఉపాధ్యక్షుడు కోలాఆనంద్‌కుమార్‌లు సారెను అందించి ఇక్కడ అన్న దాన కార్యక్రమాలను ప్రారంభిస్తారని వివరించారు.



## ఇంటింటికి రైతన్న మీకోసం

**శ్రీకాళహస్తి రూరల్ మార్చి 17 ప్రభాతవార్త** రైతన్న మీకోసం కార్యక్రమం ఏర్పేడు మండలం మన్న సముద్రం గ్రామంలో మంగళవారం ఇంటింటికి వెళ్లి రైతులను కలిసి కరపత్రాలని నాయకుల, అధికారులతో కలిసి రాష్ట్ర అధికార ప్రతినిధి, ఉమ్మడి చిత్తూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రెడ్డి వారి గురువారెడ్డి అవగాహన కల్పించారు. రెడ్డివారి గురవారెడ్డి మాట్లాడుతూ స్వర్ణాంధ్ర 2047 లక్ష్యంగా రాష్ట్రాన్ని దేశంలో అగ్రగామిగా నిలబెట్టే దిశగా ముందుకు సాగుదాం అనే విధంగా పని చేస్తున్నటువంటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు. అన్నారు . మరి రెండు డిమాండ్ ఆధారిత పంటలు దీని ద్వారా మార్కెట్లో ఉన్నటువంటి మంచి రేటు ఉన్న పంటల వైపు లా మాకు చూపడం ఎగుమతులకి అవకాశం ఉన్నటువంటి పంటలను పండించడం వాటిని ప్రోత్స హించాల్సి ందిగా మీకు ఈ కార్యక్రమం ద్వారా తెలియజేయమన్నారు. అగ్రిటెక్ ఫలితాలు సాధిస్తూ సేంద్రియ వ్యవసాయం వైపు మొగ్గు చూపా లని ఈ పంచ సూత్రాలను అనుసరించి ముందుకు పోవాలని రైతులను కోరుతున్నామన్నారు. ఈ కార్యక్ర



మంలో ఆయన పాటు గ్రామ పార్టీ అధ్యక్షులు సదా శంకర్ నాయుడు ,గ్రామ చెరువులయ కట్టు సంఘ అధ్యక్షులు ,సీనియర్ నాయకులు సుధాకర్ రెడ్డి, పార్టీ నాయకులు కే మోహన్ రెడ్డి, నాగరాజు యా దవ్, మదనంజయపెద్దఎత్తునరైతులుపంచాయతీ కార్యదర్శి సచివాలయ అగ్రికల్చర్ అధికారి పాల్గొన్నారు.

## 19న ఉగాది సంబరాలు

**శ్రీకాళహస్తి, మార్చి 17 ప్రభాతవార్త** శ్రీకాళహస్తీశ్వరాలయంలో తెలుగుసంవత్స రాది సంబరాలను ఈ నెల 19న నిర్వహించుటకు నిర్ణయించినట్లు ఆలయ ఇఓ బికె వెంకటేశు మంగళవారం తెలిపారు. గురువారం శ్రీ పరాభవ నామసంవత్స రం ఉగాది సంబరాలను నిర్వహించుటకు నిర్ణయించారు. స్థానిక ఆగమ శాస్త్ర పండితులు అందించిన సమాచారం మేరకు ఉదయం నుంచి భక్తులకు దర్శనం ఏర్పాటు చేసినట్లు వివరించారు. కాగా ఆ రోజు సాయంత్రం 4గంటలకు శ్రీస్వామి వారి ఆలయం ఎదురుగా ఆస్థాన సిద్దాంతి కరణం లక్ష్మీనారాయణ శర్మ చే పంచాంగ పఠనం ఉంటుందన్నారు. కాగా సాయంత్రం 6గంటలకు మేడసాని మోహన్ చే కవిసమ్మేళనం నిర్వహించడుతుందని భక్తులు పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఇఓ వెంకటేశు కోరారు.



## మద్యం మత్తులో దాడులు: ఒకరికి రిమాండ్

శ్రీకాళహస్తి రూరల్, మార్చి 17 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి మండలం ముద్ద మూడిలో ఇద్దరు యువకుల ఘర్షణలో ఒకడు గాయ పడగా దాడికి పాల్పడిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు సిఐ ఇబ్రహీం తెలిపారు. మంగళవారం గ్రామానికి చెందిన ఇద్దరుయువకులు పాత కక్షలతో ఘర్షణలకు దిగారు. గ్రామానికి చెందిన మణి(43) అరవింద్ (27)ల మధ్య పాత ఘర్షణల లున్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం ఇరువురు మద్యం మత్తులో మరో సారి ఘర్షణ

## రైతు సంక్షేమం కోసం ఎంతైనా చేస్తాం

– ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్



**యాదమరి, మార్చి 17 ప్రభాతవార్త:** రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం ఎంతైనా చేయడానికి సిద్ధంగా వుందని పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ పేర్కొన్నారు. మండల పరిధిలోని దసరాపల్లి గ్రామ పంచాయతీలో మంగళవారం రైతున్న మీకోసం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ మాట్లాడుతూ రైతులకు ఆధునిక సాంకేతిక వ్యవసాయ పద్దతులపై ప్రభుత్వం విస్తృతంగా అవగాహన కల్పించి ఆ మేరకు రైతులతో పంటలు సాగు చేయించి వారిని ఆర్థికంగా మరింత బలోపేతం చేయడానికి సిఎం నారా చంద్రబాబునాయుడు శ్రీకారం చుట్టారున్నారు. రైతు లబ్ది పొందడానికి గత మామిడి సీజన్‌లో మామిడికి ప్రభుత్వం ఒక కేజీ మామిడిపై రూ. 4 ప్రోత్సాహక ధర చెల్లించిందని, పిఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ప్రతి రైతుకు ఏడాదికి రూ. 20 వెలు వారి బ్యాంకు ఖాతాలో జమ అయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వ్యవసాయ శాఖ ముంద్రించిన కరపత్రాలను రైతులకు పంపిణీ చేశారు. వ్యవసాయ శాఖ జెడి మురళీ మాట్లాడుతూ రైతులు డిమాండ్ ఆధారిత వ్యవసాయ పంటలు సాగు చేయాలని పిలుపునిచ్చారు. మార్కెట్‌లో డిమాండ్ వున్న పంటలు రైతులు సాగు చేస్తే వారికి మంచి ఆదాయం లభిస్తుందన్నారు. నీటి సంరక్షణకు ప్రతి రైతు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ ఎడి ఉమా, తహసిల్దారు పార్థసారధి, మండల తెలుగుదేశం అధ్యక్షులు మొరార్జీ, ప్రధాన కార్యదర్శి వెంకటేష్‌రబ్బీ, జిల్లా తెలుగుదేశం కార్యదర్శి హేమగిరి, యాదమరి తెలుగుదేశం నాయకులు రవీంద్రమొదలి, మండల వ్యవసాయ అధికారి దీప, గ్రామ వ్యవసాయ అధికారులు అనిత, తులసీరామ్, చక్రవర్తి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, ఐసిఆర్‌పిలు, రైతులు పాల్గొన్నారు.

## ప్రతి మహిళ పారిశ్రామికవేత్తగా ఎదగాలి

– ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్




**యాదమరి, మార్చి 17 ప్రభాతవార్త:** స్వయం సహాయక సంఘాల్లోని ప్రతి మహిళ పారిశ్రామిక వేత్తగా ఎదిగి పది మందికి ఉపాధి అవకాశాలు కల్పించేలా ఎదగాలని పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ పిలుపునిచ్చారు. యాదమరి ఎంపిడిఓ కార్యాలయ ఆవరణలో మంగళవారం మహిళా దినోత్సవ వేడుకలు డిఆర్‌డిఎ పిడి శ్రీదేవి ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ మాట్లాడుతూ అనాది కాలంగా మహిళలకు ఏ బాధ్యత అప్పగించినా అన్ని రంగాల్లో విజయవంతంగా దూసుకెళ్తున్నారన్నారు. పురాణకాలం నుండి గమనిస్తే రాణి రుద్రమదేవి, ఝాన్సీలక్ష్మీబాయి ఇప్పటి మహిళలకు ఉదాహరణలుగా నిలుస్తారన్నారు. మహిళలకు ఆస్తి హక్కులో సమాన భాగం ఇవ్వాలని స్వర్గీయ ఎన్టీఆర్ ఆ నాడు చట్టం చేసి అమలు చేశారని, ప్రస్తుత సిఎం నారా చంద్రబాబునాయుడు సైతం ప్రతి మహిళా లక్షాధికారి కావాలని నిర్ణయించి ప్రతి మహిళను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దడానికి శ్రీకారం చుట్టారన్నారు. డిఆర్‌డిఎ పిడి శ్రీదేవి మాట్లాడుతూ ప్రతి మహిళను ఆర్థికంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో వీరికి ప్రభుత్వం విరివిగా రుణాలు మంజూరు చేస్తోందని, రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ చిత్రానాయుడు, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మొరార్జీ, ఎంపిడిఓ, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## 21న జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశాలు

చిత్తూరు, మార్చి 17 ప్రభాతవార్త:

జడ్పీ సమావేశభవనంలో ఈ నెల 21వ తేదీన జిల్లా పరిషత్ స్టాండింగ్ కమిటీ సమావేశాలు నిర్వహి స్తున్నట్లు జడ్పీ సిఇఓ రవికుమార్ నాయుడు ఓ ప్రకటనలో తెలిపారు. జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు గోవిందప్ప అధ్యక్షతన ఉదయం 10 నుండి 12 గంటల వరకు 1, 7, 2, 4 జడ్పీ స్థాయి సంఘ సమా వేశాలు జరుగుతాయని, అలాగే జడ్పీ వైస్ చైర్మన్ భూమిరెడ్డి ధనంజయరెడ్డి అధ్యక్షతన పాత జడ్పీ సమావేశభవనంలో ఉదయం 10.30 నుండి 11.30 గంటల వరకు 3వ స్థాయి సంఘ సమావేశమైన వ్యవసాయ కమిటీ సమావేశం, ఉదయం 11.30 నుండి 12 గంటల వరకు 5వ స్థాయి సంఘం చైర్మన్ భారతి అధ్యక్షతన, జడ్పీ వైస్ ఛైర్మన్ రమ్య అధ్యక్షతన మధ్యాహ్నం 12 నుండి 12.30 గంటల వరకు సోషల్‌వెల్ఫేర్‌స్థాయిసంఘసమావేశం నిర్వహించనున్నట్లు జడ్పీ సిఇఓ రవికుమార్‌నాయుడు పేర్కొన్నారు.

## హాస్టల్ విద్యార్థులకు ఉగాది బట్టలు

బంగారుపాళ్యం, మార్చి 17 ప్రభాతవార్త: స్థానిక గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులకు



ఉగాది బట్టలను అందజేశారు. మంగళవారం ఫైట్ ఫర్ సోషల్ జస్టిస్ అధ్యక్షులు జె. సురేంద్ర ఉచితంగా విద్యార్థులకు ఉగాది బట్టలను అందజేశారు. ప్రతి విద్యార్థి సంతోషంగా కొత్త బట్టలతో ఉగాది పండుగ చేసుకోవాలనే ఉద్దేశంతో ఉచితంగా బట్టలు అందజేశారు. హాస్టల్‌లోని 110 మంది విద్యార్థులకు ఉగాది కానుకగా బట్టలను అందించడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సి పల్ వెంకటసుబ్బయ్య, నాయకులు వెంకటరమణ, జయచంద్ర, రెడ్డప్ప, శంకర్‌నాయుడు, శ్రీనివాసులు, హేమచంద్ర, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆస్తిపన్నుమొత్తం కట్టేవారికి 50శాతం వడ్డీ రాయితీ

– కమీషనర్ శ్రీనివాసరావు



కుప్పం, మార్చి 17 ప్రభాతవార్త ఆంధ్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఇంటిపన్ను, ఖాళీజాగా పన్నులు ఒకేసారి చెల్లించేవారికి యాభైశాతం వడీ ్డ రాయితీ సౌకర్యం కల్పించడం జరుగు తోం దని మున్సి పల్ కమీషనర్ శ్రీనివాసరావు తెలిపారు. ఈఅవ కాశం మార్చి 31వతేది లోగా మాత్రమే ఉంటుం దన్నారు. పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని బకా యిలు ఉన్న పన్నులు వెంటనే చెల్లించాలని కోరారు. మున్సి పల్ కార్యాలయంలో ప్రత్యేకంగా రెండు కలెక్ష న్ కౌంటర్లను ఏర్పాటుచేయదంజరిగి ందన్నారు. ప్రజలుపన్నులు చెల్లించి మున్సి పల్ అభివృద్ధికి సహకరించాలని కోరారు.



## కెఇసి వైస్‌చైర్మన్‌చే డిజిటల్ ప్రొజెక్టర్ వితరణ

**కుప్పం, మార్చి 17 ప్రభాతవార్త** కుప్పంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల సౌకర్యార్థ ం కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్ వైస్‌చైర్మన్ డాక్టర్ సునీల్‌రాజ్ యాభైవేల విలువ చేసే డిజిటల్ ప్రొజెక్టర్, వెబ్ కెమెరాలను తనవంతు సాయంగా అందించారు. ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ నేటి డిజిటల్ యుగంలో విద్యార్థులకు దృశ్య శ్రవణమాధ్యమాల ద్వారా పాఠ్యా ంశాలు బోధించడం వల్ల సబ్జెక్టులపై వారికి మరింత పట్టు వస్తుందన్నారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం తమవంతు సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. లయన్స్‌క్లబ్ సలహాదారు మహేష్ మాట్లాడుతూ విద్యార్థులకు సహాయ సహకారాలు తప్పక అందిస్తామన్నారు. అన ంతరం దాత డాక్టర్ సునీల్‌రాజ్‌ను ఘనంగా సత్కరించారు.

## అక్షరాస్యత బ్యాంకింగ్ సేవలపై ప్రజలకు అవగాహన

**రామకుప్పం, మార్చి 17 ప్రభాతవార్త** మండల పరిధిలోని ఉన్సిగానిపల్లి పంచాయతీలో వి. కోట




భారతీయ రిజర్వ్ బ్యాంక్ ద్వారా ప్రజలకు అక్షరాస్యత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో రిజర్వ్ బ్యాంక్ యొక్క సేవలు ఆర్థిక వ్యవహారాలపై అవగాహన బ్యాంకు ఖాతాలు వాటి ఉపయోగాలు ఆర్డి, ఎఫ్ డి, పీపీఎఫ్ అకౌంట్ గురించి అవగాహన కల్పించారు. పొదుపులు చేయడం వల్ల పొదుపు ఆవశ్యకత, నగదురహిత లావాదేవీలు, బ్యాంకు భీమా పథకాలు, అటల్ పెన్షన్ పథకం, సుకన్య సమృద్ధి యోజన పథకం, పోస్ట్ ఆఫీస్ లోను బ్యాంకు సేవలను ఏ విధంగా చేసుకోవాలో వివరించారు. ప్రమాదవశాత్తు మరణించడం వల్ల సురక్ష బీమా యోజన కలుగు లాభాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సులోచన గుర్రప్ప, నేతలు శంకరాచలం, కృష్ణారెడ్డి, మనేష్, బ్యాంకు సిబ్బంది మహేష్ చంద్రయ్య, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



## ఎన్‌ఎమ్‌ఎమ్ స్కాలర్‌షిప్‌కు ఎంపిక

**రామకుప్పం, మార్చి 17 ప్రభాతవార్త** మండల పరిధిలోని గోరివిమాకులపల్లి పంచాయతీ గడ్డురు గ్రామానికి చెందిన ప్రణీత్ నేషనల్ మీన్స్ నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్లు హెచ్‌ఎం నారాయణ తెలిపారు. విద్యార్థికి 8వ తరగతి నుండి ఇంటర్ రెండవ సంవత్స రం వరకు ప్రతి సంవత్స రం 12 వేల రూపాయలు చొప్పున కేంద్ర ప్రభుత్వం విద్యార్థి చదువు కోసం బ్యాంకు ఖాతాలో వేస్తారన్నారు. గ్రామీణ ప్రాంతంలో పేద విద్యార్థిని విద్యార్థులు మంచి చదువు అభ్యసించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఎంఈఓ లు మల్లికార్జున, నారాయణ ఉపాధ్యాయులు ఆకాంక్షించారు.

## సచివాలయంను తనిఖీ చేసిన కడ పిడి

**రామకుప్పం, మార్చి 17ప్రభాతవార్త** మండల కేంద్రంలోని సచివాలయాన్ని కుప్పం కడ పిడి వికాస్



మర్మత్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మంగళవారం అంబేద్కర్ గురుకుల పాఠశాలలో పది పరీక్ష కేంద్రాలను పరిశీలించి, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వం అన్ని రకాల మౌలిక వసతులు కల్పించేందుకు సిద్ధంగా ఉందన్నారు. సచివాలయాల్లో సిబ్బంది సక్రమంగా విధులు నిర్వహించి ప్రజలతో సఖ్యతగా వ్యవహరించాలని సూచించారు. ప్రభుత్వం మీద ప్రజల నుంచి మంచి అభిప్రాయం, స్పందన వచ్చేలా చూడాలన్నారు. మండల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించి నాయకులు, అధికారులకు సమన్వయంతో పని చేయాలన్నారు. మండల కేంద్రంలో టాయిలెట్లు నిర్మించాలని నాయకులు తెలియజేశారు. ఇన్చార్జ్ ఎంపీడీవో మురళీధర్ రెడ్డి ,టిడిపి మాజీ మండల అధ్యక్షుడు ఆనంద రెడ్డి, కార్యదర్శి కామరాజు నాయక్, రెస్కో వైస్ చైర్మన్ విశ్వనాథ్, కడ సభ్యుడు రఘు, క్లస్టర్ ఇంచార్జ్ రవి రెడ్డి, యూనిట్ ఇంచార్జ్ సీతాపతి, నేతలు గుర్రప్ప, బాలరాజు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం



**వి. కోట, మార్చి 17 ప్రభాతవార్త:** మండల పరిధి లోని దొడ్డిపల్లి మలుపు సమీపంలో జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలు పలమనేరువి. కోట ప్రధాన రహదారిలో మంగళవారం తెల్లవారుజామున నెర్న పల్లెకు చెందిన షాబుద్దీన్ కుమారుడు అక్బర్ సాహెబ్ (60) తెల్లవారుజామున దొడ్డిపల్లి సమీపం లోని ఆయ్ మాత ఆలయం ఎదురుగా ద్విచక్ర వాహనం పై రోడ్డు దాటుతున్న సమయంలో గుర్తుతెరిని లారీ అతన్ని ఢీకొనడంతో సంఘటన స్థలంలోనే అతను మృతి చెందాడు. ప్రమాదాన్ని గమనించిన స్థాని కులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సమీపంలోని సిసి ఫుటేజ్ ఆధారంగా ప్రమాదాన్ని గుర్తించిన పోలీసులు ఘటన కారణమైన వాహనాన్ని గుర్తించారు. సిఐ సోమశేఖర్ రెడ్డి కేసు నమోదు చేసి పోస్టు మార్టంనిమిత్తంపోలీసులుమృదేహాన్నిపలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## ఆస్తి, ఖాళీ స్థలాల పన్ను బకాయిలపై 50 శాతం వడ్డీ మినహాయింపు

– మున్సి పల్ కమీషనర్ నరసింహప్రసాద్

**చిత్తూరు, మార్చి 17 ప్రభాతవార్త:** చిత్తూరు మున్సి పల్ కార్పొరేషన్ పరిధిలోని ఆస్తి, ఖాళీ స్థలాల పన్ను బకాయిలపై 50 శాతం వడ్డీ మినహాయింపు ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు మున్సి పల్ కమీషనర్ నరసింహప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. 2025-26 సంవత్స రం వరకు ఆస్తి, ఖాళీ స్థలాల పన్ను బకాయిలను ఒకేసారి చెల్లించి వడ్డీలో 50 శాతం రాయితీ పొందవచ్చునని కమీషనర్ తెలి పారు. ఈ నెల 31వ తేదీలోపు పన్ను బకాయిలు పూర్తి స్థాయిలో ఒకేసారి చెల్లించిన వారికి వడ్డీలో 50 శాతంరాయితీలభిస్తుందన్నారు. ఈఅవకావంనుచెల్లింపుదారులుసద్వినియోగంచేసుకోవాలనికమీషనర్‌కోరారు .

## రైతు సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న ప్రభుత్వం

**గుడిపాల, మార్చి 16 ప్రభాతవార్త:** రాష్ట్రంలో అధికారంలో వున్న కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమంకు



పెద్దపీట వేసి వారి సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తోందని ఎంపిపి గోళ్ళ హరిప్రసాద్ చౌదరి పేర్కొన్నారు. మండల పరిధిలోని నారగల్లు గ్రామ పంచాయతీలో మంగళవారం జరిగిన రైతన్న మీకోసం కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలు, కార్యక్రమాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రైతులు పంటలు సాగు చేసి రసాయన రహిత అధిక పోషక విలువలు కలిగిన ఆహార ఉత్పత్తులు సాధిస్తే రైతు ఆదాయం వృద్ధి చెందుతుందన్నారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం రైతులకు మేలు చేయాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమంను పక్కాగా నిర్వహిస్తోందన్నారు. ఈ సందర్భంగా ఎంపిపి గోళ్ళ హరిప్రసాద్ వ్యవసాయశాఖ ముంద్రించిన కరపత్రాలను రైతులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి దీపశ్రీ అనిల్, సింగిల్‌విండో ఛైర్మన్ ప్రతాప్‌నాయుడు, నాయకులు దీనదయాళ్, విజయ్, శ్రీనాథ్, చిట్టి, చందు రెడ్డి, సురేష్, దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

## గణనాథుడిని దర్శించుకున్న జమ్ము కాశ్మీర్ హైకోర్టు జడ్జి



కాణిపాకం, మార్చి 17 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయ స్వా మి వారిని జమ్ము కాశ్మీర్ హైకోర్టు జడ్జి జస్టిస్ సంజయ్ పరిహార్ కుటుంబ సమేతంగా మంగళవారం దర్శించుకున్నారు. ఆలయ దర్శ నార్థం వచ్చిన వారికి ఆలయ ఎఇఓ రవీంద్రబాబు, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘన స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామి వారి సేవలో పాల్గొన్నారు. వారికి వేద మండపంలో పండితులు ఆశీర్వచనం చేసి స్వామి వారి శేషవస్త్రాలు, ప్రసాదాలు, చిత్రపటాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో టెంపుల్ ఇన్స్ పెక్టర్ రవి, కాణిపాకం ఎస్ఐ నరసింహులు, చిత్తూరు కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ

**చిత్తూరుహెల్త్, మార్చి 17 ప్రభాతవార్త:** చిత్తూరు హైరోడ్‌లోని శేషాపీరాన్ మసీదు ఆవరణలో మంగళవారం ముస్లింల పవిత్ర మాసం రంజాన్ పురస్కరించుకుని మున్సి పల్ పారిశుధ్య కార్మికులకు మసీదు కమిటీ నూతన దుస్తులను పంపిణీ చేసింది. రంజాన్ సందర్భంగా ప్రతి ఏడాది మున్సి పల్ పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేయడం సంప్రదాయంగా వస్తోంది. ఈ మేరకు మంగళవారం మున్సి పల్ పారిశుధ్య కార్మికులకు కమిటీ సభ్యులు దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు హనీఫ్‌షా, కార్యదర్శి ఎం. అప్జల్‌ఖాన్, ఉపాధ్యక్షులు రహమాన్, కార్పొరేటర్ జెకె అల్తాఫ్, మసీదు ఇమామ్ సి. అబ్దుల్ షకూర్, అసిస్టెంట్ ఇమామ్ సి. ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఎకరాకు సాగునీరు అందేలా సిఎం చొరవ

– ప్రభుత్వవిప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్




**కుప్పం, మార్చి 17 ప్రభాతవార్త** రాష్ట్రంలో ప్రతి ఎకరా పొలంకు సాగునీరు అందించేలా సిఎం చంద్రబాబునాయుడు చొరవ చూపుతున్నారని ప్రభుత్వవిప్, కడ పిఎసి చైర్మన్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. మంగళవారం కొటాలూరు పంచాయతీ గుండ్లమడుగులో జరిగిన రైతన్నా..మీకోసం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రైతుల ఇళ్ల వద్దకు వెళ్లి కూటమి ప్రభుత్వం రైతుల స ంక్షేమంకు తీసుకుంటున్న చర్యల గురించి వివరించారు. వ్యవసాయ రంగాన్ని మరింత అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో సిఎం చంద్రబాబు పంచసూత్రాలు కార్యక్రమం చేపట్టారన్నారు. మార్కెట్ ఆధారిత పంటలసాగు, అగ్రిటెక్,ప్రకృతి వ్యవసాయ పంటలకు ప్రోత్సాహం తదితర కార్యక్రమాలను ప్రభుత్వం చేపడుతోందన్నారు.రైతులు కూడా తక్కువ నీటితోనే అధిక పంట దిగుబడులు సాధించేలా బిందుసేద్యాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. కుప్పం రైతుల కోసం కృష్ణాజలాలను తెచ్చి సుమారు 150చెరువులను సిఎం చంద్రబాబు నింపారన్నారు. రైతులు ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు రాజగోపాల్, జిల్లా అధికార ప్రతినిధి సాంబశివం, కడ సభ్యుడు రామచంద్ర,సర్పంచ్ రాజేంద్రన్, మాజీ సర్పంచ్ సంజీవి, కనీసవేతనాల మండలి సభ్యుడు శరవణ, ఐటిడిపి అధ్యక్షుడు గుణశేఖర్, తెలుగుయువత అధ్యక్షుడు కనకరాజ్, ఎఐ ఫయాజ్ బాషా, రైతులు పాల్గొన్నారు.

## రైతన్నకు అండగా కూటమి ప్రభుత్వం.

చిట్వేలి, మార్చి 17, ప్రభాతవార్త:



ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో భాగంగా కూటమి ప్రభుత్వం మూడో విడత రైతులకు 6000 రూపాయలను నేరుగా లబ్ధిదారులకు అందించి, అండగా నిలిచిందని మండల టిడిపి బాధ్యుడు కాకర్ల నాగార్జున అన్నారు. మంగళవారం రైతన్న మీకోసం పేరుతో ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాన్ని నక్కలపల్లి, తిమ్మయ్యగారి పల్లి గ్రామాలలో ప్రారంభించి ప్రభుత్వం రైతులకు చేస్తున్న మేలును గడపగడపకు వెళ్లి తెలియపరిచారు. అందుబాటులో ఉన్న సాంకేతికతను ప్రతి రైతు మొబైల్ ద్వారా తక్షణమే పొందవచ్చని కాకర్ల అన్నారు.కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సుధాకర్, ప్రధాన కార్యదర్శి అనంతయ్య యాదవ్,సీనియర్ నాయకులు బాలు రామాంజనేయులు, క్లస్టర్ కో ఇంచార్జ్ కట్టా గిరిబాబు, నక్కల పల్లి సర్పంచ్ మద్దిన చంద్రమోహన్,సింగన హరిబాబు, కాటూరి నరసింహులు,మాచిన సుబ్బరామయ్య, మద్దిన రంగయ్య, గడికోట శంకరయ్య, బుంగటావుల నాగార్జున, గ్రామ వ్యవసాయ సహాయకులు బొంతల సాయి కిరణ్, ఓబయ్య తదితరులు పాల్గున్నారు..

## నేడు శ్రీ భద్రకాళి ఆలయంలో విశేష పూజలు.

చిట్వేలి, మార్చి 17,ప్రభాతవార్త:



స్థానిక పాత చిట్వేలి గ్రామంలోని శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి ఆలయంలో ప్రతినెల నిర్వహించే అమావాస్య పూజలో భాగంగా నేడు అనగా బుధవారం సాయంత్రం 5:30 నుంచి 7:30 వరకు గణపతి హోమం, నవగ్రహ హోమం, వీరభద్ర స్వామి హోమం, భద్రకాళీ హోమాలు నిర్వహిస్తారని ఆలయ పెద్దలు తెలిపారు. హోమం అనంతరం కళాశాభిషేకం తదుపరి స్వామి వారి దర్శనం, మహా మంగళారతి ,మంత్రపుష్పం తీర్థప్రసాదాలు ఇవ్వడం జరుగుతుందన్నారు.అలాగే ఎనిమిది గంటల నుండి అన్న ప్రసాదం వితరణ ఉంటుందన్నారు. కావున భక్తులు విశేషంగా పాల్గొని స్వామివారి కృపాకటాక్షాలు పొందాలని అలయ పెద్దలు తెలిపారు.

## అందుబాటులో మామిడి పండ్ల కవర్లు.

చిట్వేలి, మార్చి 17,ప్రభాతవార్త:



పండు ఈగ నష్టాన్ని నివారించేందుకు మామిడి రైతులకు సబ్సిడీతో కూడిన పండ్ల కవర్లు అందుబాటులో ఉన్నాయని మండల ఉద్యాన శాఖ అధికారి బి.లోకేష్ తెలిపారు. మంగళవారం తాను మాట్లాడుతూ ధర 2 రూపాయలు ఉండగా 50 సబ్సిడీ పోను 1 రూపాయి చెల్లించి తమకు కావలసిన పరిమాణాన్ని పొందవచ్చని తెలిపారు.మామిడి పంట సాగులో ప్రధాన సమస్యలైనా మంగు/మసి తెగులు, పండు ఈగ, తామర పురుగులు, బూడిద తెగులు, మచ్చ తెగులు, కాయ తొలుచు పురుగు, పిండి నల్లి మరియు టెంక పురుగులు దాడిని నియంత్రించి నాణ్యమైన పండ్లు దిగుబడికి ఈ కవర్లు తోడ్పడతాయన్నారు.పింద దశలో అనగా నిమ్మకాయ/కోడిగుడ్డు పరిమాణంలో పిందెలు ఉన్నప్పుడు పండ్ల కవర్ మధ్యలోకి పిందెలు వచ్చేలా పిందెలకు కవర్లు తొడిగి, కవర్లకు ఉండే తీగ సహాయంతో కవర్లను గాలి లోపలికి చొరబడకుండా పిందెనుండి మూడు సెంటీమీటర్లు పైన తొడిమికి కట్టవలెను. పండ్ల కవర్లు కట్టిన 50 నుండి 60 రోజుల తర్వాత కాయలను కోసుకోవచ్చని అన్నారు.కాయ నాణ్యత రంగు ఉండటం వల్ల మంచి ధర లభిస్తుందని, కావలసిన రైతులు తమ గ్రామంలోని వ్యవసాయ సహాయకులను సంప్రదించాలన్నారు. ప్రతిమామిడిరైతు తప్పనిసరిగా ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని అధికారి లోకేష్ తెలియపరిచారు.

## రేపటి నుండి ఏపీఎస్ఆర్టీసీ దివ్యాంగ శక్తి అమలు

### ఏపీఎస్ఆర్టీసీ బస్సుల్లో దివ్యాంగులకు ఉచిత ప్రయాణం

తిరుపతి రవాణ మార్చి 17 ప్రభాత వార్త

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఏపీఎస్ఆర్టీసీ) దివ్యాంగుల కోసం రూపొందించిన ప్రతిష్ఠాత్మకమైన దివ్యాంగ శక్తి పథకం మార్చి 18 నుండి రాష్ట్రవ్యాప్తంగా అమలులోకి రానుంది. ఈ పథకం ద్వారా 40 శాతం అంతకంటే ఎక్కువ వైకల్యం కలిగిన దివ్యాంగులందరూ సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్, పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులలో ఉచితంగా ప్రయాణించవచ్చు. అలాగే నాన్‌స్టాప్, అంతర్రాష్ట్ర, సప్తగిరి ఎక్స్‌ప్రెస్ , అల్ట్రా డీలక్స్ బస్సులలో వీరికి 50 శాతం రాయితీ కల్పించనున్నారు. 100 శాతం అంధత్వం ఉన్నవారు, మానసిక వికలాంగులతో వచ్చే సహాయకులకు కూడా అన్ని రకాల బస్సులలో (అల్ట్రాడీలక్స్ వరకు) 50 శాతం రాయితీ లభిస్తుంది. దివ్యాంగులు తమ సదరం (సదరం ) సర్టిఫికెట్ ద్వారా ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ పద్ధతుల్లో బస్ పాస్‌లు పొందవచ్చని, ముఖ్యంగా ఏపీఎస్ఆర్టీసీ మొబైల్ యాప్ లేదా మన మిత్ర వాట్సాప్ సర్వీస్ ద్వారా డిజిటల్ పాస్‌లను సులభంగా పొందవచ్చని తిరుపతి ఆర్టీసీ పీఆర్వో ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న పాత పాస్‌లు వాటి గడువు ముగిసే వరకు చెల్లుబాటు అవుతాయని పేర్కొన్నారు. ప్రయాణ సమయంలో దివ్యాంగులు తమ ఫిజికల్ లేదా డిజిటల్ బస్ పాస్‌తో పాటు సదరం సర్టిఫికెట్ కాపీని తప్పనిసరిగా వెంట ఉంచుకోవాలని, బస్సులలో వీరికి కేటాయించిన సీట్లను వారికే ఇచ్చేలా సిబ్బందికి ఆదేశాలు జారీ చేసినట్లు ఆయన వెల్లడించారు.



## కనబడుట లేదు:

తొట్టంబేడు,మార్చి 17 ప్రభాతవార్త

తొట్టంబేడు మండలం రౌతుసూరమాలకు చెందిన వ్యక్తి గత పది రోజులుగా కనబడటం లేదని పోలీసులకు ఫిర్యాదు అందింది, ఈ ప్రాంతాల నుంచి కొందరు యువకుల్ని ఉపాధి ఆశ చూపి కొందరు తీసుకెళుతున్నట్లు సమాచారం. అయితే వారు జీవనోపాధి కోసం వెళ్ళి కాంట్రాక్టర్ల ఉచ్చులో ఇరుక్కుంటున్నారు.ఈ నేపధ్యంలో రౌతు సూర మాలకు చెందిన కుమార్(28) గత పది రోజులుగా కనబడటం లేదని తమబంధువుల ఇళ్ళవద్ద వెతికినా ప్రయోజనం లేదని స్నేహితుల వద్దకు వెళ్ళాడేమో అని పరిశీలించామని కానీ ఎక్కడా లేదని ఏమయ్యాడో ఏమో అని కుటుంబసభ్యులు తల్లడిల్లుతున్నారు. ఎవరికైనా కనబడితే చరవాణి 9177299395కు సమాచారం అందించాలని కుటుంబసభ్యులు కోరుతున్నారు.

## ఉగాది పర్వదినం సందర్భంగా స్విమ్స్ ఓ.పి, ఓ.టి.లకు సెలవు

తిరుపతి హెల్త్, మార్చి 17, ప్రభాతవార్త

శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్)కు ఉగాది పండుగ సందర్భంగా ఈ నెల 19వ తేది గురువారం రోజున ఓ.పి. మరియు ఓ.టి.లకు సెలవు దినంగా ప్రకటించిన్నట్లు స్విమ్స్ సంచాలకులు, ఉప కులపతి డా. ఆర్వి కుమార్ తెలిపారు. స్విమ్స్ అత్యవసర సేవలు యదాతథంగా కొనసాగుతాయని ఒక ప్రకటనలో తెలియచేశారు.

## గురుకులాల్లో విద్యాప్రమాణాల పెంపుపై పర్యవేక్షణ

– కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్



కుప్పం, మార్చి 17 ప్రభాతవార్త ప్రభుత్వ సంక్షేమ గురుకుల పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపడేలా నిరంతరం పర్యవేక్షణ కొన సాగుతుందని కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ పేర్కొన్నారు. మంగళ వారం మండలంలోని ఎంజెపిఏ పిబిసి హాస్టల్, కడపల్లి, రామకు ప్పంలోని బిఆర్ అంబేద్కర్ గురుకు లాల్లో ఆయన ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈసందర్భంగా పాఠశాలల్లో విద్యార్థులతో మాట్లాడారు. హాస్టల్‌లోని వసతులు, భోజన నాణ్యత గురించి ఆరా తీశారు. విద్యార్థుల అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్వయంగా గురుకులంలో వండిన భోజనం నాణ్యతను పరిశీలించారు. ఆహారం పరిశుభ్రత, ప్రమాణాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు అవసరమైన వసతుల కల్పన, వసతి గదుల పరిస్థితులపై అధికారులతో సమీక్షించారు. విద్యార్థులకు చక్కటి వాతావరణం కల్పించేందుకు అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

## పండగలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి : డిఎస్పీ

**శాంతిపురం/రామకుప్ప ం, మార్చి17 ప్రభాతవార్త** ఉగాది, రమజాన్ పండగలను ప్రజలు ప్రశాంత



వాతావరణంలో జరుపుకోవాలని డిఎస్పీ పార్థసారథి సూచించారు. మంగళవారం శాంతిపురం మండలం రాళ్లబూదుగూరు, రామకుప్పంలలో శాంతి కమిటీలతో ఆయన సమావేశం నిర్వహించారు. పండగలను సోదర భావంతో జరుపుకోవాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావివ్వరాదని సూచించారు. కార్యక్రమంలో రూరల్ సిఐ మల్లేష్ యాదవ్, ఎస్సైలు నరేష్, వెంకటమోహన్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## వి.కోటలో ప్రశాంత వాతావరణంకు సహకరించాలి : సిఐ

**వి.కోట, మార్చి 17 ప్రభాతవార్త** అంతరాష్ట్ర సరిహద్దు ప్రాంతంలో ఉన్న వి.కోటలో ప్రశాంత



వాతావరణంకు ప్రజలు సహకరించాలని సిఐ సోమశేఖర్‌రెడ్డి కోరారు. మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయం వద్ద శాంతి కమిటీ సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా ప్రజలు సోదర భావంతో ఉండాలని సూచించారు. అన్ని వర్గాల ప్రజలు అన్నదమ్ములా మెలగాలని పేర్కొన్నారు. ఉగాది, రమజాన్ పండగలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ పిఎన్ లక్ష్మి, నేతలు రామచంద్రనాయుడు, మైందల రామచంద్రుడు, పిఎన్ నాగరాజ్, అక్మల్, సుబ్బన్న,రామూర్తి, నవాజ్, సయ్యద్‌సలాంబాషా, లతీఫ్‌సాబ్, జహీర్ అహ్మద్, రెవెన్యూ, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయపంటలతో చక్కటి ఆరోగ్యం

**కుప్పం/గుడుపల్లె/రామకుప్పం, మార్చి 17 ప్రభాతవార్త** ప్రకృతి వ్యవసాయ పంటలతో ప్రజలకు చక్కటి



ఆరోగ్యం సాధ్యమని ఆర్టీసీ వైస్‌చైర్మన్ పిఎస్ మునిరత్నం, ఎఎంసి చైర్మన్ జిఎం రాజు పేర్కొన్నారు. మంగళవారంకుప్పం మండలం ఉర్ల ఓబనపల్లి, గుడుపల్లె మండలం సొన్నార్ల నపల్లి, రామకుప్పం మండలం పెద్దగానూరు, గ్రామాల్లో రైతన్నా..మీకోసం కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జీవామృతం, ఘనామృతాల తయారీ గురించి వివరించారు. ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం అన్ని చర్యలు చేపట్టిందన్నారు. సిఎం చంద్రబాబునాయుడు వ్యవసాయ రంగాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు పంచసూత్రాలను అమలు చేయాలని నిర్ణయించారన్నారు. పంటలసాగుకు నీరు అందించడంతో పాటు రైతులు డిమాండ్ ఆధారిత పంటలను సాగు చేయాలని పేర్కొన్నారు. రైతుల పంటలకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించడం జరుగుతుందన్నారు. రైతులు ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.డిపిఎం అమృతవల్లి, స్థానిక అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## 24నుంచి నారా భువనేశ్వరి కుప్పం పర్యటన..?

కుప్పం, మార్చి 17 ప్రభాతవార్త



సిఎం చంద్రబాబునాయుడు సతీమణి, ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి ఈనెల 24వతేది నుంచి కుప్పం నియోజకవర్గంలో పర్యటించనున్నారని తెలిసింది. 24,25,26 తేదీల్లో మూడు రోజులపాటు నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో పర్యటించి మహిళలతో సమావేశాలు జరుపుతారని సమాచార ం. పర్యటన పూర్తి వివరాలు ఇంకా అధికారికంగా వెల్లడి కావాల్సి ఉంది.

## మైనార్టీల సంక్షేమంకు సిఎం చంద్రబాబు పెద్దపీట

– ప్రభుత్వవిప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ – కుప్పంలో ఘనంగా ఇఫ్తార్ విందు !!

**కుప్పం, మార్చి 17 ప్రభాతవార్త** రాష్ట్రంలోని మైనార్టీల సంక్షేమానికి సిఎం చంద్రబాబునాయుడు పెద్ద



పీట వేస్తున్నారని ప్రభుత్వవిప్, కడ పిఎసి చైర్మన్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. మంగళ వారం సాయంత్రం కుప్పం తెదేపా మైనార్టీ నేతలు స్థానిక షాదీమ హల్ మసీదు వద్ద ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందుకు ప్రభుత్వవిప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్‌చైర్మన్ పిఎస్ మునిరత్న ం, పికెఎం ఉడా చైర్మన్ డాక్టర్ బిఆర్ సురేష్‌బాబు హాజరయ్యారు. ఈసందర్భంగా డాక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ ముస్లిం మైనార్టీలకు తొలినుంచి సిఎం చంద్రబాబు అండగా ఉంటూ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ఇమాం,మౌజన్‌లకు పవిత్ర రమజాన్ మాసం సందర్భంగా నాలుగుకోట్ల నిధులు మంజూరు చేశారన్నారు. మైనార్టీల కోసం దుల్హన్ పథకం, దుకాన్ మకాన్, మైనార్టీ కార్పోరేషన్ రుణాలు అందించడం జరుగుతోందన్నారు. అలాగే కడప నగరంలో హజ్ హౌస్ నిర్మిస్తున్నట్లు తెలిపారు. అన్ని మసీదులు, ఈద్గా ల మరమ్మత్తులకు సిఎం చంద్రబాబు నిధులు మంజూరు చేశారన్నారు. మైనార్టీలు కూడా తమకు మేలు చేస్తున్న సిఎం చంద్రబాబుకు మరింత మద్దతు పలకాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో రెస్కోచైర్మన్ ప్రతాప్, షాదీఖానా చైర్మన్ సర్దార్,మైనార్టీ సెల్ అధ్యక్షుడు జాకీర్, మాజీ చైర్మన్ అన్సర్, కౌన్సిలర్లు జిమ్‌దాము, సోమశేఖర్, రెస్కో డైరెక్టర్లు అమీర్, ఆర్ముగం, మున్సిపల్ మైనార్టీ అధ్యక్షుడు ఉమేర్ ఖాన్,మండల మైనార్టీ సెల్ అధ్యక్షుడు మునాఫ్, మాజీ ఎఎంసి చైర్మన్ సత్యేంద్రశేఖర్, కో క్లస్టర్ ఇన్‌చార్జ్ శ్యామ్ సుందర్ తదితరులు పాల్గొన్నారు.

## గణనాధుడిని దర్శించుకున్న సినీ నటుడు ప్రభాస్‌శ్రీను

కాణిపాకం, మార్చి 17 ప్రభాతవార్త:

సినీ నటుడు ప్రభాస్ శ్రీను మంగళవారం కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి వారిని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి ఇఒ పెంచల కిషోర్, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామి వారి సేవలో పాల్గొన్నారు. వారికి వేద మండపంలో ఆశీర్వచనం చేసి స్వామి వారి శేషవస్త్రాలు, చిత్రపటాలను అందజేశారు. అనంతరం ప్రభాస్ శ్రీను ఆలయం వెలుపల ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్, దేవస్థానం చైర్మన్ మణినాయుడులను మర్యాదపూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలిపారు.ఆలయ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

## ఆ కళాశాలపై చర్యలు తీసుకోండి

**తిరుపతి విద్య, మార్చి 16 ప్రభాతవార్త** తిరుపతి రూరల్ మండలం మల్లంగుంట సమీపంలోని ఓ



ప్రైవేటు కళాశాలలో ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుతున్న యశ్వంత్ రెడ్డి అనే విద్యార్థి ఈనెల 11 వతేదీ నుంచి కనిపించకపోవడంపై దారుణమని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆర్ఎస్ఐఓ జి రాజశేఖర్‌రెడ్డిని కలిసి ఆ కళాశాలపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రం సమర్పించారు.అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థి అదృశ్యమైన ఘటనపై తల్లిదండ్రులు గుండెలవిసేలా రోధిస్తున్నా సంబంధిత కళాశాల యాజమాన్యం ఇప్పటి ఆచూకీ వరకు స్పందించకపోడం దారుణమని మండిపడ్డారు. ఏడు రోజులుగా విద్యార్థి కోసం తిండి,నిద్రలేకుండా తల్లిదండ్రులు, బంధువులు అల్లాడుతున్నా అధికారులు, కళాశాల యాజమాన్యం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తూ చోద్యం చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. యాజమాన్యం, అధికారులు, పోలీసులు తక్షణం విద్యార్థి ఆచూకీ కోసం చర్యలు చేపట్టాలని లేనిపక్షంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబుల్రెడ్డి,ఏపీఎస్ జేఏసీ జిల్లా అధ్యక్షులు గార్లపాటి శ్రీధర్, ఎన్ఎల్ఎస్ఏ జాతీయ అధ్యక్షులు సుందరరాజు,ఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షులు జ్యోతి ప్రకాష్, జీజేఎస్ రాష్ట్ర అధ్యక్షులు మహేంద్ర నాయక్ , ఓబీసీ రాయలసీమ అధ్యక్షులు విజయ్ ఉత్తరాది,తదితరులు పాల్గొన్నారు.

## వ్యర్థాలను ఇంధనంగా మార్చే పరిశోధనకు ఒప్పందం

**తిరుపతి విద్య, మార్చి 16 ప్రభాతవార్త** ఎస్టీటీ 1 వ్యాల్యూ ఎమిషన్ ప్రైవేట్ లిమిటెడ్ ఎస్వీయూ



వ్యర్థాలను ఇంధనంగా మార్చే పరిశోధన కోసం ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు వర్సిటీలో రెక్టార్ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు, ఆ కంపెనీ ప్రతినిధి తుషార్ సంబంధిత ఒప్పందపు పత్రాలను మార్చుకున్నారు.ఈ ఒప్పందంతో కంపెనీన ఎస్వీయూ క్యాంపస్లో వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ను స్థాపించనుంది. దీంతో వర్సిటీలోని ఇంజనీరింగ్ విద్యార్థులకు అధునాత సాంకేతిక పరిజ్ఞానం పొందే అవకాశం ఉంటుంది. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ వరదరాజన్, మున్సిపల్ కార్పొరేషన్ రెవెన్యూ అధికారి రవి, ఈకో సేవియర్ క్లబ్ ప్రతినిధి సోమురవి, తదితరులు పాల్గొన్నారు.

## బాలికలకు హెచ్ పి వి వ్యాక్సినేషన్



**పుల్లంపేట, మార్చి 17 ప్రభాతవార్త :** స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం హెచ్ పి వి వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా వైద్యులు సానే శేఖర్, ఎస్ చంద్ర లు మాట్లాడుతూ ఇప్పటివరకు మండల వ్యాప్తంగా 95 మంది బాలికలకు వ్యాక్సినేషన్ వేసి వారి తల్లిదండ్రుల ద్వారా సమ్మతి పత్రాలను తీసుకోవడం జరిగిందని అన్నారు గర్భాశయ ముఖ ద్వారా క్యాన్సర్ భారీ నుండి విముక్తి పొందాలని ఈ కార్యక్రమం 90 రోజులపాటు నిరంతరంగా స్థానిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించడం జరుగుతుందని మిగిలిన బాలికలు కూడా హెచ్ పి వి వ్యాక్సినేషన్ వేసుకోవాలని వారు కోరారు ఈ కార్యక్రమంలో సి హెచ్ ఓ రాజు సూపర్వైజర్ మహేష్ కె వి సుబ్బారెడ్డి ఏఎన్ఎంలో ఆశలు పాల్గొన్నారు

## రైతన్న మీకోసం ను సద్వినియోగం చేసుకోండి:::వ్యవసాయ అధికారి సందీప్

**రైల్వేకోడూరు మార్చి 17(ప్రభాతవార్త)** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటుచేసిన రైతన్న మీకోసం కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని రైల్వేకోడూరు వ్యవసాయ అధికారి సందీప్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 16 నుండి 18 వరకు అదేవిధంగా 23 నుండి 25 వరకు మొత్తం ఆరు రోజులు రైతు సేవ కేంద్రంలో రైతన్న మీకోసం కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఇందులో భాగంగా వ్యవసాయ మరియు అనుబంధ శాఖల సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఏర్పాటు చేసిన రైతన్న మీకోసం కార్యక్రమం ద్వారా ఎంతో మంది రైతులకు ఉపయోగపడే విధంగా పథకాలు అమలు చేయడం జరుగుతుందని ఒక కరపత్రాన్ని వ్యవసాయ రైతు కుటుంబానికి అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఎల్నినో ప్రభావం ద్వారా జూన్ నుండి వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున రైతులను స్వల్పకాలిక పంటలు, తక్కువ నీరు అవసరం ఉన్న పంటలు సాగు చేయాలని అలాగే ఇప్పటినుండి నీటి సంరక్షణ పద్ధతుల ద్వారా సినీ,నిమ్మ పంటలకి నీటి కొరత వల్ల చనిపోకుండా ఎటువంటి చర్యలు తీసుకోవాలో రైతులకు తెలియజేయడం జరుగుతుందని అలాగే ప్రకృతి వ్యవసాయం పద్ధతుల ద్వారా ఎలా నీటి సంరక్షణ చేయవచ్చో రైతులకు ఈ కార్యక్రమాల ద్వారా తెలియజేయడం జరుగుతుందని సందీప్ తెలియజేశారు.

## రాఘవ రాజపురంలో పెద్ద మసీదులో ఇఫ్తార్ విందు..

**రైల్వే కోడూరు మార్చి 17 (ప్రభాతవార్త)** రైల్వే కోడూరు మండలంలోని రాఘవ రాజాపురం పెద్ద మసీదు నందు సయ్యద్ మహమ్మద్( ఎన్నారై) ఆధ్వర్యంలో ముస్లింలకు రాజకీయ నాయకులకు ఘనంగా ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సయ్యద్ షాజహాన్, సయ్యద్ షా నవాజ్ లు ముస్లిములకు ఘనంగా ఇఫ్తార్ విందును ఏర్పాటు చేసి పవిత్ర రంజాన్ మాసాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రతి ఏటా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్యే శ్రీనివాసులు, మండల ఉపాధ్యక్షులు రామిరెడ్డి ధ్వజారెడ్డి తోపాటు వైసీపీకి చెందిన పేట షఫీ, అన్వర్ భాష, కరీముల్లా, మహమ్మద్ సయ్యద్ , సయ్యద్ మన్సూర్, సయ్యద్ అ ఖిల్, కోడూరు కు చెందిన కౌ రెడ్డి సిద్దయ్య, మహేశ్వర్ రెడ్డి, సిద్ధు, దొమ్మరాజు సుబ్రహ్మణ్యం రాజు, దార్ల చంద్రశేఖర్, బండారు మల్లి తోపాటు వైసీపీకి చెందిన ప్రముఖులు పాల్గొన్నారు.

## పటిష్ట నిఘా కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు.

**చిట్వేలి,మార్చి 17, ప్రభాతవార్త:** పటిష్ట నిఘా కోసం స్థానిక చిట్వేలి గ్రామంలోని ప్రధాన కూడళ్లలో



సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు స్థానిక ఎస్సై వినోద్ కుమార్ తెలియపరిచారు. ఇందులో భాగంగా మంగళవారం కేకే వడ్డేపల్లి మూడు రోడ్ల కూడలి వద్ద ఓబన్న సర్కిల్ వద్ద నాలుగు సీసీ కెమెరాలు, రాపూర్ రహదారి అంబేద్కర్ సర్కిల్ వద్ద నాలుగు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వీటి ఏర్పాటుకు స్థానిక ప్రైవేటు పాఠశాలలు సాయి వికాస్ హై స్కూల్,అక్షర హైస్కూల్, శ్రీ పద్మావతి హై స్కూల్, నాగవరం ఎస్వీ విద్యానికేతన్ పాఠశాలల యాజమాన్యం సహకరించారని ఎస్సై తెలిపారు. కాగా చిట్వేలి ప్రధాన రహదారి వెంట, మరియు మండల సరిహద్దు గ్రామాలైన నాగవరం,అనుంపల్లి,తిమ్మయ్య గారిపల్లిలో కూడా సీసీ కెమెరాలు ఏర్పాటుకు ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సహకరించాలని ఎస్సై పిలుపునిచ్చారు. ప్రమాద సమయాలలో, అత్యవసరాలలో వాహనాలను, వ్యక్తులను గుర్తించేందుకు సీసీ కెమెరాలు తప్పనిసరి అని ఎస్సై వినోద్ కుమార్ అన్నారు.

కెనరా బ్యాంక్ Canara Bank Together we can | జయంపు శాఖ, (15496)జయంపు. సెల్: 94933 72282, 9030425405

**బంగారు నగల వేలం ప్రకటన**

ఇందుమూలముగా దిగువ తెలిపిన రుణగ్రహీతలకు తెలియజేయడమేమనగా మీరు మా బ్యాంకు వద్ద బంగారు నగలు తాకట్టు పెట్టి పొందిన రుణమును తిరిగి చెల్లించలేదు. పలుమార్లు నోటీసులు పంపిననూ బట్వాడా కాకుండా తిరిగి వచ్చినది. 23.03.2026 వ తేది లోపు బకాయిలు,ఇతర ఛార్జీలను చెల్లించి తనఖా వుంచిన సెక్యూరిటీలను తిరిగి పొందగలరు. లేనియెడల బ్యాంకు శాఖ ఆవరణంలో తేది:24.03.2026 సా.4.00గం॥లకు లేదా బ్యాంకు నిర్ణయించిన ఏదేని తేదీలలో వేలం వేయుటకు బ్యాంకు వారికి అధికారం కలదు.

| క్ర. నెం. | ఖాతానెం. | రుణగ్రహీత పేరు & చిరునామా | బంగారు బరువు (గ్రాములలో) | బకాయి మొత్తం ఛార్జీలతో రూ. |
|---|---|---|---|---|
| 1 | 180301000471 | యాతలూరు వెంకటమ్మ, భర్త రమణయ్య, జయంపు గ్రామం, బాలాయపల్లి మండలం, తిరుపతిజిల్లా | 7.80 | 26,771.20 |

జయంపు, తేది:17.03.2026    సం॥ బ్రాంచ్ మేనేజర్, కెనరా బ్యాంకు

## ఉగాదికి శ్రీచెంగాళమ్మకు చందనాలంకారం



సూళ్లూరుపేట, మార్చి 17 ప్రభాతవార్త: నూతన తెలుగు శ్రీపరాభావా నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని సూళ్లూరుపేటలోని శ్రీచెంగాళ మాత పరమేశ్వరిదేవి గురువారం భక్తులకు స్వర్ణ కిరీట చందనాలంకరణ శోభితురాలై విశ్వరూప దర్శనంతో కనువిందు చేయనున్నది. ఉగాది పర్వదినాన శ్రీచెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారికి విశేషంగా ఉదయం 10 గంటలకు కలశ ప్రతిష్టతో ఉగాది ఉత్సవాలు ప్రారంభమవుతాయి. 10 గంటల 30 నిముషాలకు లక్ష కుంకుమార్చన పూజ ప్రారంభ మవుతుంది. లక్ష కుంకుమార్చన పూజలో పాల్గొనదలచిన దంపతులు తమ పేర్లు దేవస్థానం వద్ద నమోదు చేయించు కోవాలని దేవస్థానం సహాయ కమిషనర్ బి.ప్రసన్నలక్ష్మి మంగళవారం కోరారు. ఉగాది పర్వదినాన అన్నదానానికి జివిఆర్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ఎండి కొండేపాటి గంగాప్రసాద్, కోమలి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరిస్తున్నారు. దివంగత మాగుంట సుబ్బరామిరెడ్డి, పార్వతమ్మలు, మాగుంట సుధాకర్‌రెడ్డి, స్నేహలతారెడ్డి, ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, గీతాలత దంపతులు ఉభయకర్తలుగా ఉన్నారు. లక్ష కుంకుమార్చన పూజా ద్రవ్యములకు చిట్టేటి పెరుమాళ్లు, గోవిందమ్మ దంపతులు, విశేష పుష్పాలంకరణకు చెన్నైకి చెందిన సింగన ఓబుల్‌రెడ్డి, పద్మజారెడ్డిలు, చందనాలంకరణకు నెల్లూరు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ చెన్నూరి రాంబాబు, సత్యకుమారి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరిస్తున్నారు. ఉగాది పర్వదినాన భక్తులకు ప్రసాద వినియోగం శ్రీచెంగాళమ్మ పరమేశ్వరి భక్తబృందం సూళ్లూరుపేట వారిచే అందజేయ బడుతుందని అసిస్టెంట్ కమిషనర్ బి.ప్రసన్నలక్ష్మి తెలిపారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు అందుకోవాలని కోరారు.

# సూళ్ళూరుపేట డివిజన్

## పంచాయతీలు అభివృద్ధి దిశలో నడవాలి : ఎంపిడిఓ




వాకాడు, మార్చి 17 ప్రభాతవార్త: ప్రతి పంచాయతీ సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను అమలు చేసి తద్వారా పంచాయతీ అభివృద్ధికి కృషి చేయాలని ఇంచార్జి వాకాడు ఎంపిడిఓ సి.శ్రీనివాసులు తెలియజేసారు. మంగళవారం ఎంపిడిఓ కార్యాలయంలో జరిగిన ఒక్క రోజు సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు థీమ్ 1-9 జరిగిన శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఎంపిటిసి, పంచాయతీ వార్డు సభ్యులు పంచాయతీలకు ముఖ్యమైన సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను అవగాహన చేసుకుని గ్రామ అభివృద్ధికి తమ వంతు కృషిని అందించి తద్వారా పంచాయతీ అభివృద్ధి, ప్రభుత్వ లక్ష్యాన్ని సాధించాలని తెలిపారు. అనంతరం డిప్యూటీ ఎంపిడిఓ ఎన్. దేవదానం మాట్లాడుతూ పంచాయితీ అభివృద్ధి చెందాలంటే ఆ గ్రామ ప్రజలు అభివృద్ధి చెందాలని అలాగే మౌలిక సదుపాయాలను సమకూర్చుకోవాలని ఆయన సూచించారు. వాలమేడు పంచాయితీ కార్యదర్శి షేక్ మహమ్మద్ హుస్సేన్ భాషా శిక్షణకు హాజరైన ఎంపిటిసిలకు, వార్డు సభ్యులకు వీడియో ప్రాజెక్టర్ ద్వారా పూర్తి అవగాహన కల్పించారు.

## వైసిపి వారిపై అక్రమ కేసులు పెట్టడం దుర్మార్గం : ఎంపీ

వెంకటగిరి, మార్చి 17 ప్రభాతవార్త: వైసిపి వారిపై పోలీసులు అక్రమ కేసులు పెట్టడం దుర్మార్గమని తిరుపతి పార్లమెంటు సభ్యులు డాక్టర్ మద్దిల గురుమూర్తి తెలిపారు. సులూరుపేట, తిరుపతి నియోజకవర్గాల పరిధిలో పోలీసులు నమోదు చేసిన అక్రమ కేసులపై మండిపడ్డారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో పాల్గొనేందుకు ఢిల్లీలో ఉన్న ఆయన ఈ ఘటనలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తిరుపతిలో శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా కార్యకర్తలపై అధికార పార్టీకి చెందిన వ్యక్తులు దాడి చేయగా వారిని వదిలిపెట్టి, దాడిలో గాయపడిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా కార్యకర్తలపైనే అట్రాసిటీ కేసులు నమోదు చేసి అరెస్టు చేయడం అన్యాయమని పేర్కొన్నారు. చట్టాన్ని వక్రీకరించి రాజకీయ కక్ష సాధింపులకు ఉపయోగించడం తగదన్నారు. అలాగే సూళ్లూరుపేట నియోజకవర్గంలోని పెళ్లకూరు మండలం కలవకూరు గ్రామంలో ఇసుక అక్రమ రవాణా విషయమై ప్రశ్నించిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యపై అక్రమ కేసు నమోదు చేయడం, మాజీ డీసీసీబీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణ రెడ్డి, ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యులు, గ్రామానికి చెందిన మరికొంత మంది నాయకులపై అక్రమ కేసులు నమోదు చేసి రిమాండ్‌కు పంపడం దుర్మార్గమని ఎంపీ గురుమూర్తి మండిపడ్డారు.

## నేడు డయల్ యువర్ డిఈఈ

వెంకటగిరి, మార్చి 17 ప్రభాతవార్త : సబ్ డివిజన్ పరిధిలోని వెంకటగిరి పట్టణం, రూరల్, డక్కిలి, బాలాయపల్లి మండలాల పరిధిలోని విద్యుత్ సమస్యల పరిష్కారం కొరకు ఈనెల 18వ తేదీ డయల్ యువర్ డిఈఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డి ఈఈ సీనయ్య పేర్కొన్నారు. రైతులు, వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని విద్యుత్ సమస్యలను పరిష్కారం చేసుకోవాలని ఆయన ఈ సందర్భంగా కోరారు. ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు 9440812005, ఈ నెంబర్‌కి కాల్ చేసి సమస్యలు తెలపాలన్నారు. వారంలో ప్రతి బుధవారం ఈ కార్యక్రమం నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

## ఆందోళనలో...పెళ్లకూరు వైసిపి కేడర్

పెళ్లకూరు, మార్చి 17 ప్రభాతవార్త: మండలంలోని కలవకూరులో గల ప్రభుత్వ ఇసుక రీచ్ వద్ద గత కొద్ది రోజులు ముందు సూళ్లూరుపేట నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు కిలివేటి సంజీవయ్య, మాజీ ఎన్డిడిసిబి చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, మండల వైఎస్ఆర్సిపి శ్రేణులు నిబంధనలకు వ్యతిరేకంగా అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారని రీచ్ వద్ద ఉన్న వాహనాలను అడ్డుకున్న సంగతి తెలిసిందే. ఈ సంఘటనలో అక్కడ పనిచేస్తున్న సిబ్బందిపై దురుసుగా ప్రవర్తించి వారిని దుర్భాషలాడి అక్కడ ఉన్న బిల్లింగ్ మిషన్‌ను పగలగొట్టి వారి వద్ద నుంచి రెండు సెల్ ఫోన్ లాక్కున్నారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై సుమారు 25 మందిపై కేసు నమోదు చేసిన పోలీసులు సోమవారం నాడు ఒక్కసారిగా వరుసుగా 12 మంది వైసీపీ నాయకులను అరెస్టు చేశారు. వీరిలో వైసీపీలో పెద్దదిక్కుగా ఉన్న కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్‌రెడ్డి, పెద్దపెద్ద నాయకులు వరుసుగా అరెస్టు కావడంతో మండల వైసీపీ కేడర్లో ఆందోళన నెలకొంది. వరుసగా జరిగిన ఈ సంఘటనలతో సోమవారం నాడు నాయుడుపేటలో నెలవల, కిలివేటి మీడియా సమావేశాలు ఏర్పాటు చేసి ఒకరిపై ఒకరు అవినీతి అక్రమాలపై విమర్శించుకున్నప్పటికీ వరుసగా మండల వైసీపీ అధి నాయకులు అరెస్టు కావడంతో మండలంలోని క్రింది స్థాయి వైసీపీ కేడర్ ఆందోళనలో ఉంది.

**ఇసుక రీచ్ వద్ద కేసులో 25 మందిపై కేసు:**

మండలంలోని కలవకూరు వద్ద గల ప్రభుత్వ ఇసుక రీచ్ వద్ద ఈ నెల 14వ తేదీన వైసిపి నాయకులు అక్రమంగా ఇసుక రవాణా జరుగుతుందని అడ్డుకున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా వైసీపీ శ్రేణులు రిచ్ వద్దగల సిబ్బందిపై దురుసుగా ప్రవర్తించి దౌర్జన్యం చేసి అక్కడ ఉన్న బిల్లింగ్ మిషన్ పగలగొట్టి సిబ్బంది వద్ద గలసెల్ ఫోన్ లాక్కున్నారని వారు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు సోమవారం నాడు కొంతమంది నిందితులను అరెస్టు చేశారు. పోలీసులు పత్రికలకు విడుదల చేసిన వివరాల ప్రకారం 25 మంది వైసీపీ నాయకుల పై కేసులు నమోదు కాగా వీరిలో 12 మంది నిందితులు కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, పోలంరెడ్డి శేఖర్‌రెడ్డి, అన్నమరెడ్డి సురేష్ బాబు, ఎద్దుల నారాయణరెడ్డి, కాటూరు సురేందర్‌రెడ్డి, నీలి నాగరాజు, అట్ల గోపాల్, ముచ్చల నాదముని, తెల్లగూటి ప్రభాకర్, కుక్క శ్రీనివాసులు, చింతం రెడ్డి శ్రీనివాసులు రెడ్డి, సంగీతం సుభాష్‌ను అరెస్టు చేసినట్లు పెళ్లకూరు పోలీసులు తెలిపారు.

## గిట్టుబాటు ధర కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం

**- ఏఎంసీ చైర్మన్ పులిగోటి విశ్వనాథం**



వెంకటగిరి, మార్చి 17 ప్రభాతవార్త: రైతులకు గిట్టుబాటు ధర కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఏఎంసి చైర్మన్ పునుగోటి విశ్వనాథం తెలిపారు. రైతన్న మీకోసం కార్యక్రమంలో భాగంగా మండలంలోని యాతులూరు గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రానికి విక్రయించిన ధాన్యానికి అరగంట లోపల నగదు చెల్లిస్తారని తెలిపారు. రైతులు దళారులు మాట నమ్మి తక్కువ ధరకు అమ్ముకోరాదని సూచించారు. ప్రభుత్వ ఏర్పాటు చేసిన దాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని సూచించారు. ధాన్యానికి మద్దతు ధర ప్రభుత్వం కల్పిస్తున్నట్లు తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సమస్యలు ఉంటే తన దృష్టికి గాని అధికారులు దృష్టికి గాని తీసుకొని రావాలని తెలిపారు. ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ రైతుల కోసం ఎప్పుడూ అండగా నిలుస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారిని సుజాత, గ్రామస్తులు పాల్గొన్నారు.

# పుణ్యక్షేత్రంలో గ్యాస్ కష్టాలు -వంట చెరకు వైపు హోటళ్ళు




శ్రీకాళహస్తి, మార్చి 17 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో కమర్షియల్ గ్యాస్ కష్టాలు తీరటం లేదు. ఇక ఇళ్ళకు ఉపయోగించే గ్యాస్‌కు సంబంధించి పాలకుల ప్రకటనలకు ఆచరణకు పొంతన కుదరటం లేదు. ప్రభుత్వం, ముఖ్యమంత్రి ఏమో నమోదు చేసుకున్న 36 గంటల్లో గ్యాస్ సరఫరా చేయాని ప్రకటిస్తున్నారు. అయితే స్థానిక గ్యాస్ ఏజెన్సిలు ఏమో సాధ్యం కాదంటున్నారు. బుక్ చేయటానికి కూడా 25రోజజుల వ్యవధి ఉండాలని ముడి పెడుతున్నారు. దాంతో సామాన్యుల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. కొందరు ఫాస్ట్ ఫుడ్ సెంటర్ల నిర్వాహకులు బతుకు జీవనం కోసం ఇళ్ళ గ్యాస్‌ను ఉపయోగిస్తున్నారు. హోటళ్ళు కూడా తప్పని పరిస్థితిల్లో ఇళ్ళ వినాయోగదారుల నుంచి గ్యాస్ సిలిండర్లను తీసుకొని ఉపయోగిస్తున్నారు.

**వంట చెరకు వైపు బడా హోటళ్ళు:**

శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో తేరువీధి, బజారువీధి, సన్నిధివీధిలలో భక్తులకు ఆహారం అందించే హోటళ్ళు ఉన్నాయి. దాంతో కట్టెల పొయ్యిలను ఏర్పాటు చేసుకుంటున్నారు. వంటచెరకు రేటు పెరిగినా తప్పదన్నట్లు వంట చెరకును కొనుగోలు చేస్తున్నారు. తెరువీధిలోని పెద్ద హోటళ్ళలో ఇప్పటికే కట్టెల పొయ్యలను ఏర్పాటు చేసారు. సాధారణంగా శుక్రవారం నుంచి వ్యాపారాలు మెరుగ్గా ఉంటాయి. ఇళ్ళకు వాడే గ్యాస్ సిలిండర్‌కూడా కొందరు రూ. 2వేలకుపైగా విక్రయిస్తున్నట్లు సమాచారం. అంత భారం మోయలేక పెద్ద హోటళ్ళు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటున్నారు. ప్రభుత్వం ఏమో గ్యాస్ కొరతే లేదంటుండగా ఆచరణలో పరిస్థితి ఆగమ్యగోచరంగా ఉంది. శ్రీకాళహస్తీశ్వరాలయానికి చుట్టుపక్కల భారీ సంఖ్యలో ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు నిర్వహిస్తున్నారు. వారం రోజులుగా గ్యాస్ సమస్యతో దాదాపు అన్ని మూతపడ్డాయి. సుమారు 50 పాస్ట్ ఫుడ్ సెంటర్లుమూత పడ్డాయి. మరి కొన్ని దశల వారిగా మూతపడుతున్నాయి. ఇదే పరిస్థితి కొనసాగితేవచ్చిన భక్తులకు ఆహారం ప్రశ్నార్థకంగా మారనుంది.

## మహిళలు అన్ని రంగాలలో రాణించాలి



తడ, మార్చి 17 ప్రభాతవార్త: విద్యార్థి దశ నుండి విద్యార్థినీలు ధైర్యంతో ముందుకు సాగాలని రాజ్యాంగం మనకు కల్పించిన హక్కులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూళ్లూరుపేట స్త్రీశిశు సంక్షేమ శాఖ సిడిపిఓ జ్యోతి కిరణ్ పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మిషన్‌శక్తి మహిళాశక్తి 20 రోజుల అవగాహన కార్యక్రమంలో భాగంగా మంగళవారం అక్కంపేట మోడల్ స్కూల్ విద్యార్థులకు పెరియట్టు గిరిజన కాలనీ వాసులకు మహిళా చట్టాలపై హక్కులపై అవగాహన కల్పించారు అత్యవసర హెల్ప్ లైన్ నెంబర్ 1098,181,112 నెంబర్ల ద్వారా ఏ విధంగా సహాయం పొందవచ్చు అవగాహన కల్పించారు సిడిపిఓ జ్యోతి కిరణ్, అంగన్వాడి సూపర్వైజర్ లక్ష్మీనారాయణమ్మ, తిరుపతి ఓ ఎస్ సి నగ్మా, తదితరులు పాల్గొన్నారు.

## తిరుమల పేరు ఎత్తే అర్హత....భూమనకి లేదు

**- తిరుక్షేత్రాల రక్షణ సమితి అధ్యక్షులు తుమ్మా ఓంకార్**




తిరుపతి హెల్త్, మార్చి 17 ప్రభాతవార్త: తిరుమల పేరు ఎత్తే అర్హత భూమన కరుణాకర్ రెడ్డికి లేదని, ఇంకోసారి తిరుమల విషయమై నోరు ఎత్తితే హిందూ సంఘాలతో, స్వామీజీలతో మీ ఇంటిని ముట్టడించే కార్యక్రమం చేస్తామని తిరుక్షేత్రాల రక్షణ సమితి అధ్యక్షులు తుమ్మా ఓంకార్ హెచ్చరించారు. మంగళవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో తిరుక్షేత్రాల రక్షణ సమితి అధ్యక్షులు తుమ్మా ఓంకార్ చెప్పారు. వెంకటేశ్వర స్వామి తల్లి అయిన వాకుళామాత ఆలయ గోపురం పై విగ్రహాలను విరకొట్టారని, వివిధ ప్రాంతాల నుండి దైవ దర్శనానికి వచ్చిన భక్తులను క్యూలైన్లలో పెట్టి హింసించారని ఆరోపించారు. పరకామణి చోరీ కేసులో రవికుమార్ దొంగతనం చేశారని, దొంగతనం చేసిన వ్యక్తి నుండి దొంగిలించిన వ్యక్తి కరుణాకర్ రెడ్డి గజదొంగని విమర్శించారు. గత ఐదు సంవత్సరాల పాలనలో స్వామికి ఇష్టమైన లడ్డూను కెమికల్స్‌తో కల్తీ చేశారని, స్వామి పట్ల ఎటువంటి భక్తి భావం లేని వ్యక్తి కరుణాకర్ రెడ్డి అని, అటువంటి వ్యక్తిని తిరుపతి ప్రజలు స్వచ్ఛందంగా పరిష్కరించాలని కోరారు. టీటీడీ చైర్మన్ తిరుపతి కి వస్తున్నాడని అధికారులకు, స్వామీజీలకు, భక్తులకు తెలియని విషయం అని, వైసీపీ గంజాయి బ్యాచ్‌కి ఎలా తెలిసిందని, దీని పైన పోలీసు అధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు. బి ఆర్ నాయుడు ఉన్న హోటల్ వద్దకు టిడిపి నాయకులు వచ్చి ఉండకపోతే, అతడిని మట్టుబెట్టే కార్యక్రమం చేసేవారని, అక్కడ ఎవరవుతే ధర్నా, నిరసన కార్యక్రమాలు చేపట్టారో వాళ్ళ పైన క్రిమినల్ చర్యలు తీసుకోవాలని తిరుపతి ఎస్పీని కోరుతున్నట్లు చెప్పారు. శివానంద సరస్వతి స్వామి మాట్లాడుతూ ఆయన కరుణాకర్ రెడ్డి కాదని, కన్నింగ్ రెడ్డి అని, కాగితాల రెడ్డి నుంచి కరెన్సీ రెడ్డి వరకు ఎలా ఎదిగాడో తిరుపతి ప్రజలకు చెప్పాలని కోరారు. బతుకుతెరువు కోసం తిరుపతికి వచ్చి జిరాక్స్ షాపు నడిపిన వ్యక్తి, వేల కోట్లు ఎలా సంపాదించారో తిరుపతిలో ఉన్న జిరాక్స్ షాపు యజమానులకు కూడా చెబితే వాళ్ళు సంపాదించుకుంటారని ఆరోపించారు. గత పాలనలో విగ్రహాలు అపహరణ, రథచక్రాలు దగ్ధం ఒంటివి జరిగినప్పుడు ఎందుకు మాట్లాడలేదు అని కరుణాకర్ రెడ్డిని ప్రశ్నించారు. ఈ సమావేశంలో హిందూ సంఘాలు స్వామీజీలు పాల్గొన్నారు.

## నాణ్యమైన విద్యే లక్ష్యంగా ప్రత్యేక ప్రణాళికలు

**-టీటీడీ జేఈఓ డాక్టర్ శరత్**



తిరుపతి విద్య, మార్చి 16 ప్రభాతవార్త: టీటీడీ విద్యాసంస్థల్లో వచ్చే ఏడాది నుండి మరింత నాణ్యమైన విద్య అందించేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని టీటీడీ జేఈవో డాక్టర్ ఏ శరత్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఎస్వీ ఆర్ట్స్ కళాశాల సమావేశ మందిరంలో డీఈవో వెంకట సునీల్, టీటీడీ కళాశాలలు, పాఠశాలల ప్రిన్సిపాల్స్, హెడ్ మాస్టర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు జ్ఞానం, నైపుణ్యాలు, విలువలను పెంపొందించి మంచి పౌరులుగా తీర్చిదిద్దేలా ఉపాధ్యాయులు కలిసి పని చేయాలని సూచించారు. విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేందుకు పర్యవేక్షణ, మార్గదర్శకత్వం, ప్రత్యేక శ్రద్ధ అవసరమని తెలిపారు. ప్రతిభ ఆధారంగా గ్రూపులుగా విభజించి, ప్రతి గ్రూపులో అన్ని రకాల విద్యార్థులు ఉండేలా చూసి, మంచి ప్రతిభ కలిగిన వారు ఇతరులకు సహాయం చేసే విధంగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. విద్యార్థులకు పాఠ్యాంశాలను సులభంగా అర్థమయ్యేలా బోధించాలని, చదువులో వెనుకబడిన వారిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, ఉపాధ్యాయులు పాఠాలు మరింత బాగా బోధిస్తే పరీక్షల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించవచ్చని తెలిపారు. అలాగే ఉపాధి ఆధారిత కోర్సులు, కొత్త విద్యా విధానంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. వచ్చే విద్యా సంవత్సరం నుండి ఉపాధ్యాయులు పాఠ్యాంశాలను సకాలంలో నవీకరించాలని, డిజిటల్ బోధన, స్మార్ట్ క్లాసులు ఉపయోగించాలని, ముందుగానే లెసన్ ప్లాన్ సిద్ధం చేసి బోధించే విధంగా కార్యాచరణ సిద్ధం చేయాలన్నారు. విద్యార్థులకు కెరీర్ గైడెన్స్, కౌన్సిలింగ్ తో పాటు వారి పురోగతిని నిరంతరం నమోదు చేయాలన్నారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రుల అభిప్రాయాలను సేకరించి, వారి సంక్షేమంపై కూడా దృష్టి పెట్టాలన్నారు. అనంతరం ఎస్వీ మ్యూజిక్ కాలేజీకి చెందిన కె ప్రదీప్ జాతీయ స్థాయి డోలు వాయిద్య పోటీల్లో ప్రథమ బహుమతి సాధించినందుకు జేఈవో అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్వీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీ వేణుగోపాల్ రెడ్డి, ఎస్జీఎస్ కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ, ఎస్పీడబ్ల్యూ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టి నారాయణమ్మ, ఎస్పీడబ్ల్యూ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ భువనేశ్వరి, ఎస్పీడబ్ల్యూ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ పద్మావతమ్మ, ఎస్వీ మ్యూజిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఉమలు పాల్గొన్నారు.

## 6 టన్నుల కూరగాయలు విరాళం



కాణిపాకం, మార్చి 17 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంకు దాతలు మంగళవారం అన్నదానంకు అవసరమైన సుమారు 6 టన్నుల కూరగాయలను విరాళంగా అందజేశారు. పలమనేరుకు చెందిన రవీంద్రారెడ్డి, మోహన్‌రెడ్డి, సోమశేఖర్‌నాయుడు వారి బృందం దేవస్థానంలో నిత్యఅన్నదానంకు అవసరమైన 6 టన్నుల వివిధ రకాల కూరగాయాలను ఆలయానికి విరాళంగా అందజేశారు. వీటిని దాతలు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్, దేవస్థానం ఛైర్మన్ మణినాయుడు, ఇఓ పెంచల కిషోర్‌లకు అందజేశారు. దాతలకు ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామి వారి ప్రత్యేక దర్శనం కల్పించి శేషవస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అన్నదానం పరిశుభ్రత, గ్యాస్‌సిలెండర్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలకమండలి సభ్యులు, ఎఇఓలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## మసీదుల్లో రంజాన్ సంబరాలు



శ్రీకాళహస్తి, మార్చి 17 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి మసీదుల్లోని పలు మసీదుల్లో మంగళవారం వేకువ జామున ఉపవాసదీక్షలు పాటించే వారి కోసం 'సహారి' ఏర్పాట్లు చేసారు. రంజాన్ మాసంలోని 27వ రాత్రి షబ్బెఖదర్‌గా నిర్వహించటం ఆనవాయితి. ఈ నేపథ్యంలో పలు మసీదులను రంగు రంగుల విద్యుత్ దీపాలతో దేదీప్యమానంగా తీర్చి దిద్దారు. అలాగే మసీదుల్లో దివ్యఖుర్ ఆన్ నిపుణులు హాఫీజే ఖుర్ఆన్ గురువులు ఇన్నా అన్‌జలనా, లేలుతుల్ ఖదర్' ప్రధాన్యతను వివరించారు. 27 రోజుల పాటు ప్రతి రోజూ తరావీహ్ నమాజుల్లో పఠించిన 30 కాండాల దివ్యఖుర్‌ను ముగించారు. తరువాత మసీదుకు హాజరైన భక్తులకు మిఠాయిలు పంపిణి చేసారు. అర్థరాత్రి వరకు గురువులు తమ ప్రసంగాలతో మనం స్వర్గస్తులు కావాలంటే అందుకు తగిన పనులు ఆరాధనలు చేయాలని సూచించారు. శ్రీకాళహస్తిలోని పలుమసీదుల్లో నిర్వాహకులు 'సహారి' ఏర్పాట్లు చేసారు. నూర్-ఏ-మస్‌జిద్‌లో నిర్వాహకులు సహారి ఏర్పాట్లు చేసారు. ఎంచక్కా భోజనంతో పాటు చికెన్ కర్రిని ఏర్పాటు చేసారు. వందలాది మంది ఇక్కడ సహారి సేకరించారు.

## మునిసిపాలిటీ సర్వతోముఖాభివృద్ధికి కృషి చేసాం

**-వైస్ చైర్మన్ జయప్రకాశ్**



పుత్తూరు, మార్చి 17 ప్రభాతవార్త : పుత్తూరు మునిసిపల్ పాలకవర్గం పదవీ కాలం పూర్తవడంతో మంగళవారం కార్యాలయంలోని కౌన్సిల్ హాలులో వైస్ ఛైర్మన్ డి.జయప్రకాశ్ (చిట్టి) ఆధ్వర్యంలో పాలకవర్గ సభ్యులకు సాదర వీడ్కోలు లభించింది. అయిదేళ్ల పదవీకాలాన్ని పూర్తి చేసుకున్న సభ్యులకు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించడానికి అధికార యంత్రాంగం విముఖత ప్రదర్శించిన నేపథ్యంలో తన సహచర కౌన్సిలర్లందరినీ పూలమాలలు, దుస్సాలువాలతో ఆయన ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ మంత్రి ఆర్.కె.రోజా నేతృత్వంలో అయిదేళ్లలో మునిసిపాలిటీ సర్వతోముఖాభివృద్ధికి పాలకవర్గం కృషి చేసిందని తెలిపారు. కరోనా వల్ల కొంత సమయం వృధా అయినప్పటికీ మునిసిపాలిటీలో అర్బన్ హెల్త్ సెంటర్లు, మునిసిపల్ పార్క్, శ్మశానం ఆధునికీకరణ తదితర అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. అన్ని వార్డుల్లో డ్రైనేజీ, సిమెంట్ రోడ్ల సదుపాయాలు కల్పించామన్నారు. ముఖ్యంగా మునిసిపాలిటీకి సొంత భవన నిర్మాణం పూర్తి చేసిన ఘనత వైసిపి పాలకవర్గానికే చెందుతుందని తెలిపారు. కార్యక్రమంలో వైసిపికి చెందిన కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యుడు పాల్గొన్నారు.

## ఆలయానికి కియోస్క్ యంత్రాలు విరాళం



కాణిపాకం, మార్చి 17 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంకు కరూర్ వైశ్య బ్యాంకు సౌజన్యంతో మంగళవారం 8 కియోస్క్ మిషన్లను విరాళంగా అందజేశారు. భక్తులకు వివిధ రకాల దర్శన టిక్కెట్లు, అర్జిత సేవలు, విరాళాలను సులభ పద్ధతిలో అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో కరూర్ వైశ్యా బ్యాంకు వారు 8 కియోస్క్ మిషన్లను ఆలయానికి విరాళంగా అందజేశారు. వీటిని అర్జిట సేవ కౌంటర్ల వద్ద పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలిరి మురళీమోహన్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి దాతలు అందిస్తున్న సహకారం మరువలేనిదన్నారు. కియోస్క్ యంత్రాల ద్వారా అన్ని రకాల ఆన్‌లైన్ సేవలు దేవస్థానం వద్ద సులభతరంగా అందుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఛైర్మన్ మణి నాయుడు, ఇఓ పెంచల కిషోర్, బోర్డు సభ్యులు చంద్రశేఖర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, శివప్రసాద్, నరేష్, సునీత, అనసూయ, లిల్లి వెంకటనారాయణ, ఎఇఓలు ఎస్వీ కృష్ణారెడ్డి, హరిమాధవరెడ్డి, సిఎఫ్ఓ నాగేశ్వరరావు, కరూర్ వైశ్యా బ్యాంకు ఎజిఎం సత్యనారాయణ, మేనేజర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## యుద్ధం అక్కడ... ధరలు పెరిగింది ఇక్కడ!

**-ఆహార పదార్థాలు, వంట నూనెల ధరలు పెరిగాయ్**

**- చివరకు టీ..కాఫీ ధరలు సైతం, యుద్ధం తెచ్చిన తంటా**

కుప్పం, మార్చి 17 ప్రభాతవార్త: పశ్చిమ ఆసియాలో తలెత్తిన యుద్ధం ప్రభావం సామాన్య జనంపై పడుతోంది. యుద్ధం ఎప్పుడు విరమిస్తారో తెలియదు కానీ అంతవరకు సామాన్యులకు ధరల ఇక్కట్లు తప్పేలా లేవు. ఓ పక్క హోటళ్ల నిర్వాహకులు ఆహార పదార్థాల ధరలు పెంచేశారు. మరో పక్క దుకాణాల్లో వంట నూనెల ధరలు సైతం పెరిగాయి. చివరకు టీ దుకాణాల్లో టీ, కాఫీ ధరలను సైతం యజమానులు పలుచోట్ల పెంచేశారు. కారణం యుద్ధం, ఈ పరిస్థితి కుప్పంతో పాటు పలు ప్రాంతాల్లో ఏర్పడింది. కొన్ని గ్రామీణ ప్రాంతాల్లో టీ దుకాణదారులు గతంలో మాదిరి వంటగ్యాస్‌తో కాకుండా కట్టెల పొయ్యిపై టీ పెట్టి విక్రయిస్తున్నారు.

**పెరిగిన ఆహార పదార్థాల ధరలు :**

కుప్పం ప్రాంతంలో పలు హోటళ్లల్లో ఆహార పదార్థాల ధరలు పెంచారు. ఇదివరకు మూడు ఇడ్లీలు, ఓ వడ తీసుకుంటే ఇరవై రూపాయలు తీసుకునే వారు. ఇప్పుడు పరిస్థితి మారింది. అదే మూడు ఇడ్లీలు, ఓ వడకు రూ. 30లను హోటళ్ల నిర్వాహకులు వసూలు చేస్తున్నారు. ఇది చిన్నపాటి హోటళ్ల ధరలు మాత్రమే సుమా, ఇక గతంలో టీ దుకాణాల్లో టీ 10రూ.లకు విక్రయించేవారు. ప్రస్తుతం టీ ధర రూ 15లు, కాఫీ రూ 20లుగా ఉందని జనం పేర్కొంటున్నారు. కారణం ఏమిటంటే గ్యాస్ సిలిండర్లు గతంలో లభించినట్లు ప్రస్తుతం లభించడం లేదని హోటళ్ల యజమానులు పేర్కొంటున్నారు.

**వంటనూనెల ధరలు సైతం పైకి :**

నిత్యావసరాల్లో ఒకటైన వంట నూనెల ధరలు సైతం యుద్ధం కారణంగా దుకాణదారులు పెంచేశారని సమాచార ం. పామాయిల్ లీటరు ధర గతంలో రూ 115లు ఉండగా ప్రస్తుతం రూ 120కు పెరిగింది. ఇక గోల్డ్‌విన్నర్ ఆయిల్ గతంలో రూ170 ఉంటే ప్రస్తుతం 180 ప్రస్తుతం పెరిగింది

**వాహనదారులు ముందుజాగ్రత్త :**

యుద్ధం కారణంగా ఎక్కడ పెట్రోల్, డీజిల్ ధరలు పెరుగుతాయోనని వాహనదారులు ముందుజాగ్రత్తగా వ్యవహరిస్తున్నారు. పెట్రోల్ బంకుల్లో టు వీలర్లకు చాలామంది ఫుల్‌ట్యాంక్ పెట్రోల్‌ను పట్టిస్తున్నారు. అలాగే డీజిల్‌ను సైతం వాహనదారులు కొనుగోలు చేస్తున్నారు. ఏది ఏమైనా పశ్చిమాసియా దేశాల్లో మొదలైన యుద్ధం సామాను ్యలపై ప్రభావం చూపి తంటాగా మారుతోంది.

## సత్యవేడు కోర్టుకు హాజరైన జనసేన నాయకులు



**వరదయ్యపాలెం, మార్చి 17, ప్రభాతవార్త** వరదయ్యపాలెం మండలం జనసేన నాయకులు మంగళవారం సత్యవేడు కోర్టు హాజరైయ్యారు. 2023 జూలై 11న వైసీపీ నాయకులు, వాలంటీర్లు పవన్ కళ్యాణ్ దిష్టి బొమ్మను దగ్ధం చేయడంతో నిరసనగా జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి తడ శ్రీనివాసులు ఆధ్వర్యంలో అదే రోజున పవన్ కళ్యాణ్ చిత్రపటానికి బస్టాండ్ ఆవరణలో పాలాభిషేకం చేయడం జరిగింది. దీనితో వైసిపి నాయకులు జనసేన కార్యకర్తలపై కక్ష పూర్వకంగా ఎనిమిది మంది జనసేన కార్యకర్తలపై క్రిమినల్ కేసు నమోదు చేయడం జరిగింది. ఈ కేసులో సత్యవేడు కోర్టుకు హాజరైన వారు జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి తడ శ్రీనివాసులు,శ్రీధర్,సాగర్, శేఖర్, జయకుమార్, జనార్ధన్, రాజేష్, యోగేష్‌లు ఉన్నారు.

## ఈద్గా, స్మశాన వాటికలో పారిశుద్ధ్య కార్యక్రమం



**వరదయ్యపాలెం, మార్చి 17, ప్రభాతవార్త** లోకా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని గోవర్ధనపురం సమీపంలో గల ముస్లిం మైనార్టీ సోదరులు నమాజ్ చదువు ఈద్గా, గోవర్ధనపురం సమీపంలో గల మైనారిటీ స్మశాన వాటిక మైదానంలో పిచ్చి మొక్కలు జెసిపి సహాయంతో పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేయించారు. దీంతో లోకా ఫౌండేషన్ వారికి, లోకేష్ దాసాజికి, ప్రత్యేకంగా సునీల్ దాసాజికి, ట్రస్ట్ సభ్యులకు వరదయ్యపాలెం మండలంలోని పేరుపేరునా ముస్లిం మైనారిటీ సోదరులు అందరి తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఫోటో

## అపరిశుభ్రంగా చిన్న పాండుర్ బస్ షెల్టర్



**వరదయ్యపాలెం, మార్చి 17, ప్రభాతవార్త** నిలువ నీడ లేక కూర్చోవడానికి వీలు కాక దుర్గంధ భరితంగా దర్శనమిస్తున్న చిన్న పాండురు బస్ షెల్టర్ వద్ద ప్రయాణికులు అవస్థకు గురవుతున్నారు. వరదయ్యపాలెం మండలం చిన్న పాండూరులోని ఆంజనేయ స్వామి గుడి వద్దనున్న బస్సు షెల్టర్‌ను చిరు వ్యాపారులు తాత్కాలిక వ్యాపార స్థావరాలుగా ఏర్పాటు చేసుకుని తమ వ్యాపారాలు ముగించుకున్న తర్వాత వ్యర్థాలను అక్కడే విడిచి వెళ్తున్నారు. ఈ వ్యర్థాలు కుళ్ళి అపరిశుభ్రంగా తయారవడంతో ప్రయాణికులు లోపల కూర్చోలేని పరిస్థితి నెలకొంది. బస్సు కోసం వేచి చూసే ప్రయాణికులు చేసేదేమీ లేక ఎండలో నిలబడే పరిస్థితి ఏర్పడింది. ప్రయాణికులు అవస్థకు గురవుతున్న పంచాయతీ అధికారులు, ఆర్టీసీ అధికారులు చర్యలు చేపట్టకపోవడం పై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రయాణికుల సౌకర్యార్థం ఇప్పటికైనా అధికారులు స్పందించి బస్ షెల్టర్‌ను శుభ్రపరిచి వ్యాపారాలు చేపట్టకుండా చర్యలు చేపట్టాలని ప్రయాణికులు విజ్ఞప్తి చేశారు.

## బిందు సేద్యానికి 90 శాతం రాయితీ



**వడమాలపేట, మార్చి 17 ప్రభాతవార్త:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బిందు సేద్యానికి భారీగా రాయితీలు ప్రకటించారని వ్యవసాయశాఖ ఏడీఏ లక్ష్మీదేవి తెలిపారు. రైతన్న సేవలో మన మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంగళవారం వడమాలపేట మండలంలోని టీసీ అగ్రహారం గ్రామంలో నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బిందు సేద్యానికి ఎస్టీ, ఎస్సీ రైతులకు వంద శాతం, సన్న, చిన్నకారు రైతులకు 90 శాతం, మధ్య తరగతి రైతులకు 70 శాతం రాయితీతో వ్యవసాయశాఖ ద్వారా అందజేస్తున్నట్లు తెలిపారు. రైతులకు ప్రభుత్వం ఎలాంటి ప్రోత్సాహకాలు అందజేస్తున్నారో తెలియజేసి కంపత్రాలు ఇంటింటికి అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి విజయకుమార్, ఏఏవో మోహన్, చిత్తూరు పార్లమెంట్ ఉపాధ్యక్షుడు ధనంజయ నాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు దాము యాదవ్,రవిరెడ్డి,దాము,వెంకటరమణారెడ్డి,కృష్ణారెడ్డి,చంద్రారెడ్డి,చంద్రబాబు, పురుషోత్తం పాల్గొన్నారు.

## జేఆర్ఎఫ్, నెట్ అభ్యర్థులకు పీహెచ్‌డికి ధరఖాస్తుల ఆహ్వానం

**తిరుపతి విద్య, మార్చి 16 ప్రభాతవార్త** ఎస్వీయూలో వివిధ సబ్జెక్టుల్లో పీహెచ్‌డి కోర్సులో చేరేందుకు అర్హులైన యూజీసీ జెఆర్ఎఫ్, నెట్, సీఎస్ఐఆర్‌జెఆర్ఎఫ్, సీఎస్ఆర్ అర్హతలు కలిగిన అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. సైన్స్, ఆర్ట్స్, కామర్స్, మేనేజ్మెంట్, ఇంజనీరింగ్ సబ్జెక్టులలో పరిశోధన చేయాలనుకున్న విద్యార్థులు ఈనెల 30వ తేదీలోపు ఎస్వీయూలోని డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు ఎస్వీయూ అధికారిక వెబ్సైట్ తో పాటు 0877 2248589 ఫోన్ నంబర్ ను సంప్రదించాలని సూచించారు.

## ఎస్వీడబ్ల్యూలో ఘనంగా సోషియల్ వర్క్ డే

**తిరుపతి విద్య, మార్చి 16 ప్రభాతవార్త** పద్మావతి మహిళా డిగ్రీ అండ్ పీజీ కళాశాల సోషల్ వర్క్




విభాగం ఆధ్వర్యంలోమంగళవారం సోషల్ వర్క్ డేని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వచ్ఛంద సేవా సంస్థల్లో సోషల్ వర్క్ పాత్ర అనే అంశంపై వర్కషాపు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సంఘసంక్షేమ కార్యకర్త పద్మశ్రీ డాక్టర్ సునీత కృష్ణన్ ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ తన జీవితంలో జరిగిన ఎన్నో అనుభవాలే తాను సమాజ సేవ చేయడానికి మార్గదర్శకంగా నిలిచాయని చెప్పారు. మనిషి ధైర్యంగా ముందుకు ఎలా సాగాలి, జీవితంలో వచ్చిన ఒడిదుడుకులను ఎలా ఎదుర్కొని మనిషిగా ఎదగాలి, సమాజానికి ఎలా ఉపయోగపడాలనే అంశంపై విద్యార్థులకు పలు ఉదాహరణలో వివరించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ డీఈఓ వెంకట సునీల్, ప్రిన్సిపల్ డాక్టర్ టి నారాయణమ్మ, కన్వీనర్ డాక్టర్ భద్రమణి, డాక్టర్ భువనేశ్వరి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వినియోగదారుల హక్కులపై అవగాహన సదస్సు




**తిరుపతి విద్య, మార్చి 16 ప్రభాతవార్త** ఎస్వీయూ డిపార్ట్మెంట్ ఆఫ్ ఎకనామెట్రిక్స్, హ్యూమన్ రైట్స్ అండ్ సోషియల్ డెవలప్మెంట్, ఆకాంక్ష స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో వర్సిటీలోని సెనేట్ హాల్ లో మంగళవారం వినియోగదారుని హక్కులు, బాధ్యతలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్వీయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సుధారాణి అధ్యక్షత వహించి మాట్లాడుతూ వినియోగదారుడు వస్తువులను కొనుగోలు చేసే సమయంలో ఆ వస్తువుల కాలపరిమితిని గమనించి కొనుగోలు చేయాలన్నారు. అన్ని రకాల వస్తువులపై మార్కెట్లో మోసాలు జరుగుతున్నాయని వినియోగదారులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు.వినియోగదారుడు ప్రతి విషయంలో జాగ్రత్తగా తమ హక్కులను బాధ్యతలను తెలుసుకుని నడుచుకోవాలని తెలియజేశారు. వినియోగదారులు మోసపోతే కన్జ్యూమర్ కోర్టును సంప్రదించి న్యాయం పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఆచార్య భాస్కర్ రెడ్డి, జిల్లా వినియోగదారుల సంఘం అధ్యక్షులు రాజారెడ్డి పాల్గొని వినియోగదారుని హక్కులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు

## సుబ్రహ్మణ్యంరాజు మృతదేహానికి నివాళులర్పించిన ఎంపీపీ



**విజయపురం, మార్చి 17 ప్రభాత వార్త:** మండలంలోని గాండ్ల కండ్రిగ గ్రామానికి చెందిన తెలుగు దేశం పార్టీ సీనియర్ నాయకులు సుబ్రహ్మణ్యం రాజు మృతి చెందారు. ఈ నేపథ్యం లో మంగళవారం వారి భౌతిక కాయానికి ఎంపీ లక్ష్మీపతిరాజు పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే ముత్యాల రెడ్డి కండ్రిగ గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు వెంకట్రామరాజు మృతి చెందగా వారి మృతదేహానికి పూలమాల వేసి నివాళు లర్పించి కుటుంబ సభ్యులను పరామర్శిం చారు. ఎంపీపీతో పాటు మండల పార్టీ అధ్యక్షుడు రమేష్‌రాజు, ప్రకాష్‌రాజు తదితరులు ఉన్నారు.

## రాజన్న పార్క్‌లో వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయండి

-కమిషనర్‌కు ఆర్కాట్ వినతి

**తిరుపతి,మార్చి 17ప్రభాతవార్త:** తిరుపతినగరంలోని రాజన్నపార్కులో వాకింగ్‌ట్రాక్ ఏర్పాటుచేయాలని



వాకర్స్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ చైర్మన్ ఆర్కాట్ కృష్ణ ప్రసాద్ కోరారు. మంగ ళవారం ఉదయం నగరపాలకసంస్థ కార్యాలయంలో కమిషనర్ ఎన్.మౌర్యను కలిసి పలు అంశాలపై వినతిపత్రం అందజేశారు. రాజన్న పార్కులో వాకింగ్ ట్రాక్ , యోగ సాధనశాలను ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై కమిషనర్ మౌర్య సానుకూలంగా స్పందిస్తూ ప్రజల ఆరోగ్య దృష్ట్యా తప్పకుండా వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేస్తామని తెలిపారు. తిరుపతి నడిబొడ్డున ఉన్న రాజన్న పార్కులో ప్రస్తుతం సాయంత్రం వేళ మాత్రమే చిన్నపిల్లలు ఆడుకునేందుకు అనుమతులు ఇస్తున్నారనీ ,వాకింగ్ ట్రాక్ లేనందువల్ల పిల్లలతో వచ్చే తల్లిదండ్రులు ఖాళీగా సమయం వృధా అవుతున్నందున వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేస్తే మంచిదని కోరామన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మౌర్యకి తిరుపతి వాకర్స్ అసోసియేషన్ల తరపున కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఆర్కాట్ కృష్ణ ప్రసాద్, రామమూర్తి, ఈశ్వర్ రెడ్డి, శాంతి,శేషాద్రి,వెంకట్రాముడు తదితరులు పాల్గొన్నారు

## రేపు మహతిలో ఉగాది సంబరాలు

**తిరుపతి,మార్చి 17ప్రభాతవార్త:** హిందూ ధర్మప్రచార పరిషత్ ,టిటిడి సంక్షేమ విభాగం సంయుక్త



ఆధ్వర్యంలో పరాభవ నామ సంవత్సర ఉగాది వేడుకలు రేపు తిరుపతి మహతి కళాక్షేత్రంలో జరగనున్నాయి. ఈ కార్యక్రమం ఉదయం 9.30 గంటలకు ప్రారంభమవుతుంది. ఉదయం 10.05 గంటలకు ప్రముఖ పండితులు పంచాంగ శ్రవణం చేపడుతారు.ఆ తర్వాత కవి సమ్మేళనం జరుగుతుంది.

**-పద్మావతి అమ్మవారి ఆలయంలో వేడుకలు:** సిరులతల్లి తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయంలో ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఉదయం 10 గంటలకు కల్యాణోత్సవం, మధ్యాహ్నం 3 నుండి 4 గంటల వరకు శ్రీకృష్ణస్వామి ముఖ మండపంలో అమ్మవారి ఉత్సవర్లకు అభిషేకం నిర్వహిస్తారు. సాయంత్రం 6 నుండి రాత్రి 7.30 గంటల వరకు పుష్ప పల్లకిలో అమ్మవారు ఆలయ నాలుగు మాడ వీధులలో విహరించి భక్తులను కటాక్షి ంచనున్నారు.

## టాస్క్ ఫోర్సు టీమ్‌కు ఉగాది సేవా పతకాలు



**తిరుపతి,మార్చి 17ప్రభాతవార్త:** ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక టాస్క్ ఫోర్సు విభాగానికి ఏడు ఉగాది సేవా పతకాలు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. టాస్క్ ఫోర్స్ చీఫ్ లంకెల సుబ్బారాయుడు ,ఎస్పీ పి.శ్రీనివాస్ అధికారులు, సిబ్బంది పనితీరును గుర్తించి, వీరికి పతకాలను సిఫారసు చేశారు. టాస్క్ ఫోర్సు ఆర్ఐ బి. సత్యసాయి గిరిధర్ కు సేవా పతకం, ఆర్ఐ సి. వినోద్ కుమార్ కు కఠిన సేవా పతకం, కానిస్టేబుల్ ఎం. మణికంఠకు కఠిన సేవా పతకం, హెడ్ కానిస్టేబుళ్ల కే రాజేష్ రాజుకు కఠిన సేవా పతకం, ఎం. వెంకటరమణకు సేవా పతకం, కానిస్టేబుళ్లు ఎం. రాజేష్ కు ఉత్తమ సేవా పతకం, డి. కిరణ్ కు సేవాపతకం లభించాయి. పతకాలకు ఎంపికైన వారికి అభినందనలు తెలిపారు.

## శుభాష్‌నగర్‌లో అగ్నిప్రమాదం

-భారీగా ఆస్తినష్టం

**తిరుపతి,మార్చి 17ప్రభాతవార్త:** తిరుపతినగరంలోని శుభాష్‌నగర్‌లో మంగళవారం ఉదయం



సంభవించిన అగ్నిప్రమాదం లో రేకుల ఇల్లు పూర్తిగా కాలి పోయింది. ఇంట్లోని విలువైన వస్తువులు, పిల్లల పుస్తకాలు, నగదు బూడిదైంది. శుభాష్ నగర్‌లోని ఇంట్లో నివాస ముంటున్న మునికృష్ణ భార్య సునీత ఇద్దరు పిల్లలు ఉంటారు. రెండవకుమార్తె పదవతరగతి చదవుతోంది. మంగ ళవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ప్రమాదవశాత్తు మంటలు లేచి ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. ఇంట్లోని అన్ని వస్తువులు, నగదు, దుస్తులు,బీరువా బూడిదయ్యాయి. స్థానికుల సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది మంటలు ఆర్పివేశారు. కట్టుబట్టలతో నిరాశ్రయులయ్యారు. కూలీపనులు చేసుకుని జీవనం సాగించే తమకు ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని బాధితులు వేడుకున్నారు.

## ఏప్రిల్ 1న తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో చండీహోమం

**తిరుపతి,మార్చి 17ప్రభాతవార్త:** తిరుపతినగర గ్రామదేవత తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో ఏప్రిల్



1వతేదీ బుధవారం పౌర్ణమి సందర్భంగా చండీహోమం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఛైర్మన్ నైనారు మహేశ్‌యాదవ్ తెలిపారు. ఎంతో పవిత్రమైన చైత్రపౌర్ణమిన ఈ హోమం ఆలయంలో జరిపిస్తున్నట్లు, ఇందుకు గృహస్థభక్తులు వెయ్యిరూపాయలు చెల్లించి రశీదు పొందవలెనని కోరారు. ఈ హోమంకు గృహస్థులు సాంప్రదాయ దుస్తులు ధరించి రావాలని ఛైర్మన్ తెలిపారు. ఆరోజు ఉదయం 9గంటలకు హోమం మొదలవుతుందన్నారు.

## దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రారంభోత్సవం : ఎమ్మెల్యే

**సత్యవేడు, మార్చి 17 ప్రభాతవార్త:** సత్యవేడులో ఎమ్మెల్యే ఆదిమూలం పర్యటనలో భాగంగా అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ వేడుకల్లో పాల్గొంటారని ప్రజాప్రతినిధులు తెలిపారు. బుధవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రత్యేక అవసరాల వ్యక్తులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం చేయుటకు బస్సు పాస్‌లు పంపిణీ చేయనున్న సంగతి తెలిసిందే. ముఖ్యమంత్రి కార్యక్రమం పూర్తయిన వెంటనే ఎమ్మెల్యే సత్యవేడులో దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రారంభోత్సవంలో పాల్గొని వారికి ఉచిత బస్సు పాసులు పంపిణీ చేయడంతో పాటు ప్రత్యేక అవసరాలు వారిని దగ్గరుండి సత్యవేడు-తిరుపతి బస్సులో ఎక్కించి వారితో కలిపి ప్రయాణించనున్నారు. ఈ కార్యక్రమానికి అధికారులు, ప్రజాప్రతినిధులు, కూటమి పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

## జిల్లా బిజెపి ఓబీసీ మోర్చా దేవాంగ కమ్యూనిటీ

**వరదయ్యపాలెం, మార్చి 17, ప్రభాతవార్త** జిల్లా బిజెపి ఓబిసి మోర్చా దేవాంగ కమ్యూనిటీ జిల్లా ఇన్చార్జిగా కేబి గురుదేవ్‌ను నియమించడంతో వరదయ్యపాలెం మండలం భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు దిలీప్ రాయల్, భారతీయ జనతా పార్టీ కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేసారు. బిజెపి ఓబిసి మోర్చాలో పదవి ఇచ్చిన తిరుపతి జిల్లా, భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు, సామంచి, శ్రీనివాసులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సన్నారెడ్డి దయాకర్ రెడ్డికి, ఓబీసీ మోర్చా అధ్యక్షులు గోపి ఆచారికి ధన్యవాదాలు తెలిపారు. వరదయ్యపాలెం మండల భారతీయ జనతా పార్టీ కుటుంబ సభ్యుల తరపున హృదయపూర్వకంగా మండల భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు దిలీప్ రాయల్ అభినందనలు తెలిపారు.

## అదనపు గ్రాంటు ఆమోదం వచ్చింది... కాస్త ఆగండి...!

24న వేతనాలు చెల్లిస్తామన్న ఎస్వీయూ అధికారులు
నిరసన విరమించుకున్న ఉద్యోగులు

**తిరుపతి విద్య, మార్చి 16 ప్రభాతవార్త** ఎస్వీయులో వేతన వెతలపై మంగళవారం నాన్ టీచింగ్



ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశమైంది. అసోసియేషన్ సెక్రటరీ సుబ్రమణ్యం ఆధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పెండింగ్ జీతాలను బుధవారంలోపు చెల్లించేలా అధికారులకు తేల్చిచెప్పాలని నిర్ణయించారు. అనంతరం వర్సిటీ రెక్టార్ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడును కలసి అసోసియేషన్ సభ్యులు సమస్యలను వివరించారు. 16వ తేదీ గడుస్తున్నా వేతనాలు చెల్లించకపోవడం దారుణమని, ఉగాది పండుగ రోజున కుటుంబ అవసరాలకు చిల్లిగవ్వ చేతిలో లేదని వేతనాలు తక్షణం చెల్లించాలని డిమాండ్ చేశారు. గత రెండేళ్ల నుంచి ఉద్యోగులకు నెల ఒకటో తారీఖున వేతనాలు అందిన దాఖలాలలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. ఈఎంఐలు, బ్యాంకు రుణాలు, వడ్డీలు చెల్లించలేక అపరాధరుసుములు కట్టుకునే పరిస్థితి దాపరించడం ఏమిటని ప్రశ్నించారు. వర్సిటీ ఆర్థికంగా నష్టపోకూడదనే ఉద్దేశంతో ఎంతో ఓపికతో ఉద్యోగులు పనిచేస్తున్నా అధికారులు, ప్రభుత్వం వేతనాలు సకాలంలో చెల్లించకపోవడం దారుణమని మండిపడ్డారు.

***24న వేతనాలు చెల్లిస్తాం..!***

అసోసియేషన్ నాయకుల సమస్యలపై రెక్టార్ స్పందిస్తూ... ప్రభుత్వం వద్ద పెండింగ్లో ఉన్న అదనపు గ్రాంట్ ఫైల్ కు మంగళవారం ఆమోదం లభించిందని చెప్పారు. అడ్మినిస్ట్రేటీవ్ క్లియరెన్స్ పూర్తి చేసుకుని వచ్చే మంగళవారం 24వ తేదీ నాటికి ప్రతి ఉద్యోగి అకౌంట్లో వేతనాలు జమచేస్తామని తెలిపారు. దీంతో అసోసియేషన్ నాయకులు, ఉద్యోగులు మంగళవారం చేపట్టాల్సిన నిరసన కార్యక్రమాన్ని విరమించుకున్నట్లు ప్రకటించారు. అప్పటికీ వేతనాలు జమకాకపోతే తమ కార్యచరణ ప్రకారం ముందుకెళ్లతామని నాయకులు తేల్చిచెప్పారు.

## స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలపై శిక్షణా కార్యక్రమం



**తిరుపతిరూరల్, మార్చి17 ప్రభాతవార్త:** తిరుపతిరూరల్ గ్రామాల అభివృద్ధిని శాశ్వతంగా ముందుకు తీసుకెళ్లే దిశగా కీలకమైన అడుగుగా స్థిరమైన అభివృద్ధి లక్ష్యాల (ఎస్‌డిజిఎస్) స్థానికీకరణపై ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఈ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేస్తున్న రాష్ట్ర గ్రామ స్వరాజ్ అభియాన్ (ఆర్‌జిఎస్ఏ) వార్షిక కార్యాచరణ ప్రణాళిక 2025-26లో భాగంగా ఏర్పాటు చేసినట్లు డిప్యూటీ ఎంపిడిఓ పి.యన్.మణి తెలిపారు.

**ప్రజాప్రతినిధులకు మార్గదర్శనం** ఈ శిక్షణలో ఎంపిటిసి సభ్యులు, వార్డు సభ్యులకు గ్రామ స్థాయిలో అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడం, స్థానిక అవసరాలకు అనుగుణంగా ఎస్‌డిజిఎస్ లక్ష్యాలను అనుసంధానం చేయడం వంటి అంశాలపై అవగాహన కల్పించినట్లు డిప్యూటీ ఎంపిడిఓ వెల్లడించారు. ప్రభుత్వ పథకాల అమలు, గ్రామాల్లో ఆరోగ్యం, విద్య, పారిశుద్ధ్యం, పర్యావరణ పరిరక్షణ వంటి రంగాల్లో సమగ్ర అభివృద్ధి సాధించడంలో స్థానిక నాయకుల పాత్ర ఎంత కీలకమో వివరించారు.

***తిరుపతిలో ప్రత్యేక ప్రాధాన్యం*** తిరుపతిరూరల్ మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ఈ శిక్షణకు పెద్ద సంఖ్యలో ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. గ్రామాల అభివృద్ధి కోసం ప్రభుత్వ లక్ష్యాలను గ్రామస్థాయికి తీసుకెళ్లే విధంగా ఈ కార్యక్రమం ఉపయుక్తమవుతుందని అధికారులు తెలిపారు.

***గ్రామాభివృద్ధికి దిశా నిర్దేశం*** ఈ శిక్షణ ద్వారా గ్రామాల్లో ప్రణాళికబద్ధ అభివృద్ధి, వనరుల సమర్థ వినియోగం, ప్రజల భాగస్వామ్యం పెంపు వంటి అంశాల్లో స్పష్టత లభించిందని పాల్గొన్న సభ్యులు పేర్కొన్నారు. గ్రామాల సమగ్ర అభివృద్ధికి ఈ కార్యక్రమం మార్గదర్శకంగా నిలుస్తుందని, భవిష్యత్‌లో స్థిరమైన అభివృద్ధి లక్ష్యాల సాధనకు బాటలు వేస్తుందని తెలిపారు.

## ద్రౌపదీ సమేత ధర్మరాజు ఆలయంలో

వివాహ మహోత్సవంలో మాజీ మంత్రి రోజా



**పుత్తూరు రూరల్, మార్చి 17 ప్రభాతవార్త:** పుత్తూరు పట్టణంలోని శ్రీ ద్రౌపదీ సమేత ధర్మరాజు ఆలయంలో నిర్వహించిన శుభ వివాహ మహోత్సవంలో మాజీమంత్రి రోజా భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ తరపున నూతనంగా నిర్మించిన 47 అడుగుల అమ్మవారి విగ్రహాన్ని ప్రత్యేకంగా దర్శించుకుని అమ్మవారికి పూజలు నిర్వహించారు. అనంతరం వివాహ వేడుకల్లో పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు ,భక్తులు పాల్గొన్నారు.

## అన్నదాత సుఖీభవ 3వ విడత ఇంటింటా కార్యక్రమం

**విజయపురం, మార్చి 17 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం మండలంలోని



కోసలనగరం గ్రామంలో ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ సూచనల మేరకు వ్యవసాయ అధికారి రజనీకుమారి ఆధ్వర్యంలో అన్నదాత సుఖీభవ 3వ విడత ఇంటింటా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులను ప్రత్యక్షంగా కలుసుకుని, కూటమి ప్రభుత్వంలో రైతులకు అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలను వ్యవసాయ అధికారి వివరించారు. అనంతరం ఎంపీపీ లక్ష్మీపతిరాజు మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకంలో కవర్ కాని, రైతులవివరాలను సేకరించడం, భూసార పరీక్షల అవసరం, సేంద్రియ ఎరువుల వాడకం గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారితో పాటు టీడీపీ అధ్యక్షుడు రమేష్‌రాజు, ఈ పార్లమెంట్ అధికార ప్రతినిధి మునిభాస్కర్ రాజు, పార్టీ నాయకులు కొండూరు దామురాజు, బూత్ ఇన్‌చార్జిలు, పలువురు రైతులు పాల్గొన్నారు.

## టిటిడి విద్యాసంస్థల్లో

నాణ్యమైన విద్యాభివృద్ధి
- జాతీయ స్థాయి వాయిద్య పోటీల్లో విద్యార్థికి ప్రథమ బహుమతి



**తిరుపతి,మార్చి 17ప్రభాతవార్త:** విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాల్సిన అవసరం ఉందని టిటిడి జెఈఓ డాక్టర్ ఎ.శరత్ తెలిపారు. మంగళవారం ఎస్వీ ఆర్ట్స్ కళాశాల సమావేశ మందిరంలో టిటిడి డిఈఓ వెంకట సునీలు, టిటిడి కళాశాలలు, పాఠశాలల ప్రిన్సిపాల్స్, ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. టిటిడి విద్యాసంస్థల్లో వచ్చే ఏడాది నుండి మరింత నాణ్యమైన విద్య అందించేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని జెఈఓ డాక్టర్ శరత్ సూచించారు. ఎస్వీ సంగీత కళాశాలకు చెందిన కె. ప్రదీప్ జాతీయ స్థాయి డోలు వాయిద్య పోటీల్లో ప్రథమ బహుమతి సాధించాడు. ఈ సందర్భంగా జెఈఓ అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాళ్ళు వేణుగోపాల్ రెడ్డి, సత్యనారాయణ, నారాయణమ్మ, భువనేశ్వరి, పద్మావతమ్మ, ఉమ ముద్దుబాల పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## అంబేద్కర్ విగ్రహం ఎదుట వైసీపీ శాంతియుత నిరసన

తిరుపతి కలెక్టరేట్, మార్చి 17 ప్రభాతవార్త : తమపై టీడీపీ రౌడీయిజాన్ని వ్యతిరేకిస్తూ తిరుపతి ఆర్టీసీ బస్టాండ్ ఎదుట డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహం వద్ద వైసీపీ నిరసన ప్రదర్శించింది. టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు పరాయి మహిళతో రాసలీలల్లో మునిగితేలడానికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు ఇటీవల వెలుగు చూశాయి. దీంతో టీటీడీ చైర్మన్ పదవికి రాజీనామా చేసి టీటీడీ ప్రతిష్టను కాపాడాలని వైసీపీ డిమాండ్ చేస్తోంది. అయితే సమాజంలో పరువు పోగొట్టుకున్నప్పటికీ, టీటీడీ చైర్మన్‌గా కొనసాగుతుండడం అనైతికమని, ఇప్పటికైనా పునరాలోచించాలని కోరుతూ బీఆర్ నాయుడు బస చేస్తున్న హోటల్ వద్ద శాంతియుతంగా నిరసన ప్రదర్శన చేయడానికి వెళ్లిన వైసీపీ శ్రేణులపై టీడీపీ గూండాలు భౌతికదాడికి పాల్పడ్డాయి. కనీసం మహిళలన్న గౌరవం కూడా లేకుండా దాడికి పాల్పడ్డాన్ని వైసీపీ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. అలాగే బాధితులపైనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్ని బనాయించి , జైళ్లకు పంపడాన్ని వైసీపీ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. కూటమి ప్రభుత్వ అధికార దుర్వినియోగాన్ని, తమపై వేధింపుల్ని వ్యతిరేకిస్తూ వైసీపీ అధిష్టానం రాష్ట్ర వ్యాప్తంగా శాంతియుత నిరసనకు పిలుపు ఇచ్చింది. ఇందులో భాగంగా తిరుపతిలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహం ఎదుట నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త భూమన అభినయ్ నేతృత్వంలో శాంతియుత నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి నాయకులు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా భౌతికదాడులకు పాల్పడుతున్నారంటూ మండిపడ్డారు. తిరుపతిలో చెడు సంప్రదాయానికి శ్రీకారం చుట్టారని, భవిష్యత్‌లో భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని తీవ్ర హెచ్చరిక చేశారు. ఇందులో మాజీ ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి, చెవిరెడ్డి హర్షిత్, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం , సత్యవేడు ఇంచార్జి రాజేష్, జిల్లా మహిళా అధ్యక్షురాలు మాధవి రెడ్డి తిరుపతి నగర అధ్యక్షుడు మల్లం రవిచంద్ర రెడ్డి, వైస్సార్సీపీ నాయకులు పాల్గొన్నారు.

## 2 కిలోల గంజాయి స్వాధీనం...ఒకరు అరెస్టు



తొట్టంబేడు, మార్చి 17 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి పొలిమేరల్లోని తొట్టంబేడు మండలం నుంచి విచ్చల విడిగా గంజాయి అక్రమ రవాణా సాగుతుంది. అయితే పోలీసులు నిఘా వేసి పలుమార్లు అరెస్టులు చేస్తున్నా అక్రమ రవాణా తగ్గటం లేదు. ఈ నేపథ్యంలో మంగళవారం టూటౌన్ పోలీసులు ఒకరిని అరెస్టు చేసి ఆతని నుంచి 2కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు సిఐ నాగరాజు మీడియా వారికి తెలిపారు. మంగళవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాగరాజు మాట్లాడుతూ ముందుగా అందిన సమాచారం మేరకు బంగారమ్మ కాలనీ నుంచి కైలాసగిరికి వెళ్ళె దారిలో ఓ వ్యక్తిని అదుపులో తీసుకొని విచారించగా ఆతను గంజాయి స్మగ్లింగ్‌చేస్తున్నట్లు గుర్తించామని తెలిపారు. నిందితుడుతమిళనాడు రాష్ట్రం కాంచీపురానికి చెందిన వేణుగోపాల్ (64) ను అదుపులో తీసుకొని విచారించగా ఆతనివద్ద 2కిలోల గంజాయి ఉన్నట్లు గుర్తించామన్నారు. నిందితుడు వేణుగోపాల్‌పై తిరుచానూరు పోలీసు స్టేషన్‌లో గతంలోనే కేసు నమోదు అయినట్లు వివరించారు. ఆతను ఒరిస్సా రాష్ట్రం నుంచి గంజాయి తెచ్చి తిరుపతి పరిసరాల్లో విక్రయించే వారని విచారణలో వెల్లడైందన్నారు. తెచ్చిన గంజాయిని దాచటానికి వెళుతుండగా దాడి చేసి పట్టుకున్నామని తెలిపారు.

## రాస్‌లో ముందస్తు రంజాన్



ఏర్పేడు, మార్చి 17 ప్రభాతవార్త : రాష్ట్రీయ సేవ సమితి (రాస్), పాపానాయుడుపేట, ఏర్పేడు మండలంలోని ప్రాంతీయ కార్యాలయంలో నేడు రంజాన్ మాసం ముందస్తు వేడుకలను పొదుపు సంఘాల సభ్యుల ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రాస్ ప్రధాన కార్యదర్శి డాఎస్. వెంకటరత్నం, వి నాగరాజు ఆదేశాల ప్రకారం జరిగిన సూర్యాస్త మయంలో నమాజ్ చేసి ఉపవాస దీక్ష విరమించారు. పాపానాయుడుపే జామీయ మసీదు మొత్తవల్లి షేక్ లాలసాహెబ్, హాజరత్ గులాం ముస్తఫా, అబ్దుల్ హన్నాన్, హాజీమాబీ వారి అధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు. పొదుపు సంఘాల ద్వారా ఈ విధమైనా కార్యక్రమం దేవుడు పట్ల నమ్మకం వంటివి క్రమశిక్షణను అలవాటు చేయడం గొప్పదని ముస్లీం సభ్యులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో రాస్ ప్రాజెక్ట్ అధికారి రవి,మత్తు పదార్థాల పునరావసు కేంద్రం డైరెక్టర్ అన్నాదొరై , సురేశ్, మునీంద్ర,గౌతమి మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## కారాకొల్లు రోడ్డుపైనే కల్లు విక్రయాలు



తొట్టంబేడు, మార్చి 17 ప్రభాతవార్త : మండలంలోని కారా కొల్లు గ్రామానికి వెళ్లే రోడ్డుపై బహిరంగంగా కల్లు విక్రయాలు యదేచ్ఛగా చేస్తున్నారు. దీంతో మందు బాబులు రోడ్డుపై వచ్చే మహిళల పట్ల అసభ్యంగా వ్యవహరిస్తున్నారని పలువురు మహిళలు వాపోయారు. గతంలో కలువిక్రయాలు గ్రామ శివారు ప్రాంతాల్లో కల్లు విక్రయాలు చేసేవారని అయితే రోడ్డుపైనే కల్లును బహిరంగంగా విక్రయిస్తుండడంతో మహిళలు, పాఠశాలకు వెళ్లే విద్యార్థుల పట్ల మందుబాబులు అసహ్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో కల్లు,మద్యం వ్యక్రయాలను కలువిక్రయాలను అరికట్టాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.

## సర్వమానవ సౌభ్రాతత్వమే మతసామరస్యం



తిరుపతి,మార్చి 17ప్రభాతవార్త: ఆధ్యాత్మిక నగరం తిరుపతిలో మతసామరస్యానికి నిదర్శనంగా పవిత్ర రంజాన్ మాసంలో ముస్లిం సోదరులకు రాయలసీమ రంగస్థలి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక తాతయ్యగుంటలోని ఆమినియా మసీదులో ఈ కార్యక్రమం జరిగింది. మంగళవారం సాయంత్రం రంజాన్ ప్రార్థనలు ముగించుకున్న ముస్లిం సోదరులు ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ప్రతి ఏడాది ఇఫ్తార్ విందు నిర్వహించడం సంప్రదాయంగా కొనసాగుతుందని గోపీనాథరెడ్డి తెలిపారు. తిరుపతి లో పవిత్ర రంజాన్, పీర్ల పండుగలలో హిందువులు పాల్గొనడం అలాగే దీపావళి, సంక్రాంతి, వినాయక చవితి వంటి పండుగల్లో ముస్లింలు భాగస్వామ్యం కావడం మతసామరస్యానికి గొప్ప ఉదాహరణ అని వివరించారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్ రెహమాన్, మస్తాన్, రహీం భాయ్, పీరం భాయ్, రఫీ, టిప్పు, చాంద్ బాషా, కరీం,కేఎన్ రాజ, పొన్నాల జేజిరెడ్డి, తొండమనాటి సుబ్రహ్మణ్యం రెడ్డి,లోక ప్రభాకర్ నాయుడు, మిట్టపల్లి బ్రహ్మానందం ఉన్నారు.

## గ్యాస్ కొరత లేదు

**- జిల్లాలో అందుబాటులో 16 వేల డొమెస్టిక్ సిలెండర్లు**

**- బుక్ చేసిన రెండు రోజుల్లో ఇళ్ళ వద్దకు సిలెండర్ పంపుతున్నాం**

**- జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్**




చిత్తూరు, మార్చి 17 ప్రభాతవార్త: జిల్లాలో వంట గ్యాస్ సిలెండర్ల కొరత ఎక్కడా లేదని, సిలెండర్ల కొరత వుందంటూ వస్తున్న వార్తల్లో వాస్తవం లేదని జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ పేర్కొన్నారు. జిల్లాలో ప్రస్తుతం 42 గ్యాస్ ఏజెన్సీలు పని చేస్తుండగా ఈ ఏజెన్సీల వద్ద ఎక్కడా గ్యాస్ కొరత లేదని, ఏజెన్సీల వద్ద సంవృద్ధిగా సిలెండర్లు వున్నాయని వివరించారు. జిల్లాలో ప్రస్తుతం 16 వేల డొమెస్టిక్ గ్యాస్ సిలెండర్లు అందుబాటులో వున్నాయని తెలిపారు. డొమెస్టిక్, వాణిజ్య అవసరాలకు వినియోగదారులు గ్యాస్ సిలెండర్‌ను బుక్ చేసుకున్నట్లైతే వారికి ఒకటి రెండు రోజుల్లోనే వారి ఇంటి వద్దకు సిలెండర్లు డెలవరీ అవుతున్నాయన్నారు. జిల్లాలో ఎల్పిజి వ్యవస్థ సక్రమంగా పని చేస్తోందని, వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా పరిపాలన యంత్రాంగం నిరంతరం పర్యవేక్షిస్తుందన్నారు. జిల్లాలోని ప్రతి గ్యాస్ ఏజెన్సీకి జిల్లా పరిపాలన యంత్రాంగం తరపున, ప్రత్యేక అధికారులను నియమించడం జరిగిందన్నారు. వీరు సరఫరా, డిమాండ్ పరిస్థితులను నిత్యం విశ్లేషిస్తూ పర్యవేక్షిస్తుంటారన్నారు. కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి వచ్చిన ఫిర్యాదులను సత్వరం పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు.

## చిల్లర రాజకీయాలు మానుకో భూమనా!



శ్రీకాళహస్తి మార్చి 17 ప్రభాతవార్త: ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ప్రముఖ హిందూ దేవాలయం, కలియుగ దైవంగా కోట్లాది మంది ప్రజలు పూజించే శ్రీవేంకటేశ్వర స్వామి కొలువైన తిరుమలలో, తిరుపతి నగరంలో శాంతి భద్రతల సమస్యలు సృష్టించాలని చూస్తున్న టిటిడి మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి చిల్లర రాజకీయాలు చేయడం మానుకోవాలని తెలుగుదేశం పార్టీ నాయకులు హెచ్చరించారు. గత వైసిపి ప్రభుత్వ పాలనాకాలంలో టిటిడిలో జరిగిన అవకతవకలు, అక్రమాలను వెలికితీసి, వైసిపి అధినేత మార్గదర్శకత్వంలో అటు భూమన, ఇటు వైవి హైందవ ధర్మానికి చేసిన ద్రోహాన్ని ప్రజలందరికీ తెలియజేస్తున్న టిటిడి ఛైర్మన్ బి.ఆర్.నాయుడు గారిపై ఇటీవల వ్యక్తిగత దూషణలు చేస్తూ, భౌతిక దాడులకు ప్రయత్నించిన తిరుపతి తింగరోడు భూమన బృందం చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నాము. 2023 ఏప్రిల్ 29న పరకామణి నుంచి విదేశీ కరెన్సీ దొంగతనం చేస్తూ పట్టుబడ్డ రవికుమార్ విషయంలో కేసు రాజీ చేయించి దొంగను విడిచి పెట్టడంలో భూమన కరుణాకర్‌రెడ్డిది అత్యంత క్రియాశీలక పాత్ర అని, అలాగే 2025 జనవరి 11న పరకామణి నుంచి బంగారు బిస్కెట్ చోరీ చేస్తూ దొరికిపోయిన పెంచలయ్యను కూడా 2023 వ సంవత్సరంలో భూమన కరుణాకర్ రెడ్డే విధుల్లో చేర్పించాడని, ఏడుకొండల స్వామి వారి సంపదను దోచుకోవాలన్న కుట్రతోనే అంతా ఒక పథకం ప్రకారమే చేశారని ఆరోపించారు. టిటిడి ఛైర్మన్లుగా పనిచేసిన వైవి సుబ్బారెడ్డి మరియు భూమన కరుణాకర్‌రెడ్డి హయాంలో జరిగిన అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి రావడంతో, అటు స్వామి వారికి ఇటు భక్తులకు తాము చేసిన ద్రోహం కారణంగా ఏరోజైనా జైలుకు వెళ్ళడం ఖాయం అని ఆందోళనకు గురైన తిరుమల బందిపోటు తిరుపతి నగరంలో వికృత చర్యలకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి డా.జి.దశరథాచారి, వన్నెకుల క్షత్రియ సంక్షేమం మరియు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల్ రవి, గిరిజన సలహా మండలి సభ్యులు యం.సుబ్బయ్య, బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.యం.ఉమేష్ రావు, తంగేళ్ళ పాలెం పిఎసియస్ ఛైర్మన్ బీమాల భాస్కర్ ముదిరాజ్, శ్రీకాళహస్తి పట్టణ కార్యనిర్వాహక కార్యదర్శి వజ్రం కిషోర్, నాయీ బ్రాహ్మణ సాధికార సమితి తిరుపతి పార్లమెంటు సోషల్ మీడియా కన్వీనర్ కోట చంద్రశేఖర్, తిరుపతి పార్లమెంటు నాయకుడు గంగనపల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఒకేసారి ఆస్థి పన్ను చెల్లించండి

**-వడ్డీ పై 50 శాతం రాయితీని పొందండి-కమిషనర్ మౌర్య**



తిరుపతి,మార్చి 17ప్రభాతవార్త: తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలోని ఇంటి యజమానులు బకాయి ఉన్న ఆస్థి పన్నులను ఒకేసారి చెల్లించి వడ్డీ లో 50శాతం రాయితీ పొందాలని కమిషనర్ ఎన్.మౌర్య సూచించారు. ప్రభుత్వం ఆస్తిపన్ను చెల్లింపు పై 50 శాతం వడ్డీ మాఫీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని, ఈ సదవకాశాన్ని ఆస్తిపన్నుదారులు సద్వినియోగం చేయనుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులు అనుసరించి నగరపాలక సంస్థకు చెల్లించవలసిన ఇంటిపన్నులు, ఖాళీ జాగా పన్నుల బకాయిలు మార్చి 31 వ తేదీ లోపు ఏక మొత్తంగా ఒకే సారి చెల్లించిన యెడల వాటిపై విధించబడిన వడ్డీలో 50 శాతం మినహాయింపును పొందవచ్చునని తెలిపారు. తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలోని గృహ యజమానులు/ ఆస్తిపన్ను చెల్లింపుదారులు ప్రభుత్వం కల్పించిన ఈ సదవకాశం వినియోగించుకొని నగరపాలక సంస్థకు చెల్లించవలసిన ఇంటిపన్నులు, ఖాళీ జాగా పన్నుల బకాయిలు వెంటనే చెల్లించి, 50 శాతం వడ్డీ రాయితీని పొందాలని విజ్ఞప్తి చేశారు. ఈ అవకాశం మార్చి 31 వ తేదీ వరకు మాత్రమే ఉంటుంది. ఎటువంటి పొడిగింపు ఉండదని తెలిపారు. సకాలంలో పన్నులు చెల్లించి నగర అభివృద్ధికి తోడ్పాటు అందించాలని కమిషనర్ మౌర్య ప్రజలను కోరారు.

## సెట్విన్ సౌజన్యంతో కెరీర్ డెవలప్‌మెంట్‌పై అవగాహన



శ్రీకాళహస్తి,మార్చి 17 ప్రభాతవార్త: శ్రీకాళహస్తిలోని శ్రీ విద్యాప్రకాశానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం సెట్విన్ సారథ్యంలో కేరీర్ దెవపల్ మెంట్‌పై విద్యార్థులకు అవగాహన సదస్సును నిర్వహంచారు. డిగ్రీ చదువుతున్న విద్యార్థులకు వ్యక్తిత్వ వికాశం, కెరీర్ డెవలప్‌మెంట్ అనే అంశంపై కళాశాల కెరీర్ గైడెన్స్ సెల్ అధ్వర్యంలో తిరుపతి జిల్లా సెట్విన్ వారి సౌజన్యంతో అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేసారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.నరసింహవర్మ కార్యక్రమాలకు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు వ్యక్తిత్వ వికాశంతో పాటు భవిష్యత్తు కార్యచరణ క్రమబద్దంగా ప్రణాళికా బద్దంగా రూపొందించుకుంటే అదే విజయానికి సోపానమౌతుందన్నారు. ఈ కార్యక్రమాల్లో సెట్విన్ తిరుపతి జిల్లా సిఇఓ కె.మోహన్, విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం,పాజిటివ్ థింకింగ్, లక్ష్య నిర్దేశం, నైపుణ్యాభివృద్ధి వంటి అంశాలకు సంబంధించి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమాల్లో కెరీర్ గైడెన్స్ మోటివేటర్ ఎన్ ఎస్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో అందుబాటులో ఉన్న ఉద్యోగవ కాశాలను వివరించారు. కళాశాల కెరీర్ గైడెన్స్ కళాశాల కన్వీనర్ డాక్టర్ రమేష్ బాబు, డాక్టర్ వి.మునెయ్య, డాక్టట్ సతీష్, డాక్టర్ సాయివెంకటేశ్, రామసుంకన్న తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు అన్నదానం



శ్రీకాళహస్తి,మార్చి 17 ప్రభాతవార్త: వైకాపా బియంఆర్ సైనికుడు జి.విజయ కుమార్‌రెడ్డి మంగళవారం పేదలకు అన్నదానం జరిపారు. మాజీ శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి కుటుంబానికి అత్యంత విశ్వాసంతో పని చేస్తున్న జివికెరెడ్డి ఆకాష్‌రెడ్డి జన్మదిన సందర్భంగా పేదలకు అన్నదానం అందించారు.

## ఇఫ్తార్ విందులో ప్రభుత్వ విఫ్





కార్వేటినగరం, మార్చి 17 ప్రభాతవార్త: కార్వేటినగరం జామియా మసీదులో జరిగిన రంజాన్ ఇఫ్తార్ విందులో ప్రభుత్వ విఫ్,గంగాధరనెల్లూరు శాసనసభ్యులు డాక్టర్ వి.యం.థామస్ పాల్గొని ముస్లీం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. జామియా మసీదులో జరిగిన ప్రార్థనలో ఆయన పాల్గొన్నారు. జామియా మసీదుకు విచ్చేసిన ఎమ్మెల్యే థామస్‌కు మసీదు ప్రెసిడెంట్ హమీద్‌ఖాన్, మైనారిటీ నాయకులు శాలువ కప్పి పుష్పగుచ్చం అందించారు. అనంతరం సి.యం.సహాయనిధిని థామస్ అందించారు. మైనారిటీలకు నా అండ ఎప్పుడూ వుంటుందని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో మైనారిటీ నాయకులు,తెలుగుదేశం నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## శివ సంతోష్ కుమార్‌కి బెస్ట్ ఓరల్ పేపర్ అవార్డు



తిరుపతి హెల్త్, మార్చి 17 ప్రభాతవార్త: శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) కమ్యూనిటీ మెడిసిన్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పి.శివ సంతోష్ కుమార్ ఫిబ్రవరి 27 నుండి మార్చి 1వ తేది వరకు కమ్యూనిటీ మెడిసిన్ నేషనల్ కాన్ఫరెన్స్ నమో మెడికల్ కాలేజ్, దాద్రా నగర్ హవేలీ, డయ్యూ, డామన్ నందు బెస్ట్ ఓరల్ పేపర్ అవార్డును తీసుకున్నట్లు స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డా. రామ్ తెలియజేశారు. 5 సంవత్సరాల లోపు పిల్లలలో దోమతెర వాడకం గురించి రీసెర్చ్ స్టడీ ప్రజంట్ చేసి బెస్ట్ ఓరల్ పేపర్ అవార్డు (ఫ్యాకల్టీ కేటగిరీ లో) ను అందుకున్నారు. ఈ సందర్భంగా స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డా ఆర్.వి.కుమార్, కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డా. నాగరాజ్, కమ్యూనిటీ మెడిసిన్ వైద్యులు అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. శివ సంతోష్ కుమార్‌ను అభినందించారు.

## ఎస్వీ వైద్య కళాశాల విద్యార్థుల విజయబేరి



తిరుపతి హెల్త్, మార్చి 17 ప్రభాతవార్త: డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల పీజీ వైద్య విద్యా ర్థుల క్రికెట్ టోర్నమెంట్లో శ్రీవెంకటేశ్వర వైద్య కళాశాల (తిరుపతి) విజేతగా నిలిచింది. నాలుగురోజులుగా కాకినాడ రంగ రాయ వైద్య కళాశాల క్రీడా మైదానంలో జరుగుతున్న పోటీలు ఆదివారం ముగిశాయి. చివరిరోజు హోరాహోరీగా సాగిన రంగరాయ వైద్య కళాశాల (కాకినాడ), పై శ్రీవెంకటేశ్వర వైద్య కళాశాల (తిరుపతి) ఘన విజయం సాధించింది. ఆంధ్రప్రదేశ్ డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం వారి ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర కళాశాల క్రికెట్ క్రీడల్లో విజేతగా ఎస్ వి వైద్య కళాశాల పీజీ వైద్య విద్యార్థులు ఈ విజయం సాధించినందుకుగాను క్రీడల్లో పాల్గొన్న పీజీ వైద్య విద్యార్థులకు క్రీడా వైద్య సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. ఎస్వీ వైద్య కళాశాల అదనపు వైద్య విద్య సంచాలకులు మరియు ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రవి ప్రభు, తుది పోరులో కాకినాడ జట్టుపై తిరుపతి జట్టు గెలుపొంది ఛాంపియన్గా నిలిచింది. పిజి వైద్య విద్యార్థులు క్రికెట్ క్రీడలో ఇదే మొదటిసారిగా గెలుపొందడం కళాశాలకు ఎంతో గర్వకారణంగా ఉందని కళాశాల అధ్యక్షులు ఈ సందర్భంగా తెలిపారు. శ్రీ వెంకటేశ్వర వైద్య కళాశాల జట్టుకు ట్రోఫీ అందజేసిన ముఖ్య అతిథులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ వైద్య విద్య సంచాలకులు డాక్టర్ బాబ్జి, ట్రోఫీని, గోల్డ్ మెడల్స్ విజేతలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ వి వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ డి .ఎస్.ఎన్ మూర్తి, ఎస్ వి వైద్య కళాశాల క్రీడల చైర్మన్ డాక్టర్ పి సురేష్ బాబు, మహిళ వైద్య విద్యార్థుల క్రీడా విభాగ ఇన్చార్జ్ డాక్టర్ కె.రోజారమణి, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ శరవణ, పీజీ వైద్య విద్యార్థుల కెప్టెన్ డాక్టర్ వెంకట సాయి గౌతం, ఎస్ వి వైద్య కళాశాల పిఆర్ఓ. వీర కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## 30 రోజులు రైల్వే బ్రిడ్జి కింద రాకపోకలు బంద్

**-ప్రత్యామ్నాయ మార్గాలు సూచించిన అధికారులు**



రేణిగుంట,మార్చి 17 ప్రభాతవార్త: 50 సంవత్సరాల క్రితం నిర్మించిన రేణిగుంట-కడప- నెల్లూరు రైల్వే బ్రిడ్జిని 30రోజులు పాటు తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు ఆర్డీవో భాను ప్రకాష్‌రెడ్డి అండర్ బ్రిడ్జి వద్ద మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో తెలిపారు. నెల్లూరు, కడప, తిరుపతి, చెన్నై వైపు వెళ్లాల్సిన వాహనాలు అండర్‌బ్రిడ్జి కింద నుండి ప్రయాణం సాగిస్తున్నాయి. బ్రిడ్జి నిర్మించి 50 సంవత్సరాలు కావస్తున్న సందర్భంలో మరమ్మతుల్లో భాగంగా బ్రిడ్జిని తాత్కాలికంగా 30 రోజులు మూసివేస్తున్నట్లు రైల్వే అధికారులు నిర్ణయించినట్లు ఆర్డీవో తెలిపారు. మార్చి నెల 23వ తేదీ నుండి ఏప్రిల్ నెల 22వ తేదీ వరకు బ్రిడ్జి కింద రాకపోకలు జరగవని అన్నారు. ప్రత్యామ్నాయంగా కరకంబాడి రోడ్డు, కొత్త బైపాస్, సంత మార్కెట్ రోడ్ల మీదుగా వాహనాలు దారి మళ్లిస్తున్నామన్నారు. సంత మార్కెట్ రోడ్డులో కేవలం ద్విచక్ర వాహనాలకు మాత్రమే అనుమతి ఉంటుందని తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు. సమావేశంలో రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసరావు, తహసిల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, అర్బన్ సీఐ జయచంద్ర, అర్బన్ ఎస్సై ధర్మారెడ్డి పలువురు రైల్వే అధికారులు, పోలీసు, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## రైతు మహా సభలను విజయవంతం చేయండి




శ్రీకాళహస్తి,మార్చి 17 ప్రభాతవార్త: శ్రీకాళహస్తిలో ఈ నెల 22న నిర్వహించ నున్న రైతు మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా ప్రదాన కార్యదర్శి హేమలత పిలుపు నిచ్చారు. సోమవారం పట్టణంలోని పుచ్చల పల్లి సుందరయ్య భవన్‌లో ఏపీ రైతు మహాసభ కు సంబంధించిన ముఖ్య నాయకుల సమా వేశం జరిగింది. ముఖ్యఅతిథిగా జిల్లా కార్యదర్శి హేమలత హాజర య్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి, ఎన్‌డిఏ ప్రభుత్వం వచ్చిన తరువాత రైతుల పరిస్తితి దయనీయంగా మారిందన్నారు. జిల్లా రైతాంగం సమస్యలపై కూటమి ప్రభుత్వం శీతకన్ను వేసిందన్నారు. పంటకు గిట్టుబాటు ధరల్లేకుండా తల్లడిల్లుతుంటే పట్టించుకునే నాధుడు లేదన్నారు. అన్నదాత సుఖీభవ సహాయం రైతుల అవసరాల కుపనికి రాలేదన్నారు. తూర్పు మండలాల్లో ఒబ్బిడుల సందర్భంగా నిల్వ చేసుకునే అవకాశం లేక రైతులు కల్లాల్లోనే దళారులకు ధారబోస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. కూటమి ప్రభుత్వం ఒక్క గింజకూడా కొనుగోలు చేయటం లేదని ఆరోపించారు. రైతాంగం సమస్యలను పరిష్కరించుటకు మహాసభను వేదికగా పోరాటాలకు సిద్ధం కావాలని రైతాంగానికి పిలుపు నిచ్చాఉ. ఈ కార్యక్రమాల్లో రైతు సంఘం అధ్యక్షులు రంగయ్య, అంగేరి పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## అమ్మచెరువు రీ సర్వే లోపాలను సరిదిద్దాలి!



శ్రీకాళహస్తి రూరల్,మార్చి 17 ప్రభాతవార్త: మండలంలోని పాతగుంట పంచాయతీలోని అమ్మ చెరువు గ్రామంలో భూముల రీసర్వేలపై జరిగిన లోపాలను సరిదిద్దాలని రైతులకు న్యాయం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు మంగళవారం డిమాండ్ చేసారు. శ్రీకాళహస్తి మండలంలో భూముల రీసర్వే జరిగిన రెవెన్యూ గ్రామాల్లో సాంకేతిక లోపాల కారణంగా ఎల్‌పిఎం నెంబర్లు, జాయింట్‌ఖాతాలుగా నమోదయ్యాయని వారు ఆరోపించారు. సమస్యాత్మక రెవెన్యూ గ్రామాల్లో ఎల్‌పిఎం నెంబర్లు సబ్ డివిజన్‌చేసి రైతులకు రాజముద్ర కల్గిన పాస్‌పుస్తకాలను అందజేయాలని కోరారు. ఈ మేరకు మంగళవారం మండల ఇన్‌చార్జి తహశీల్దార్ అనిల్‌కుమార్‌కు వినతి పత్రం అందిస్తూ రైతులు ఎ దుర్కొంటున్న సమస్యలను వివరించారు. రైతుల చేతిలో పాస్‌పుస్తకాలేనందువల్ల రిజిస్ట్రేషన్ తనఖా లేక రుణ సమస్యలు తలెత్తుతాయని నాగరాజు ఆరోపించారు. అమ్మచెరువు రెవెన్యూ గ్రామ ఖాతాలో 65లోని సర్వే నెంబర్ 17/6,6ఏ,42/5,49/4,58/8బి 54/4లో ఎల్‌బిఎం నెంబర్స్ జాయింట్ గా వచ్చాయని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సమస్యాత్మక గ్రామాల్లో సర్వేలు నిర్వహించి సబ్‌డివిజన్లు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం కార్యదర్శి గంధం మణి తదితరులు పాల్గొన్నారు.

## దారి దోపిడి చేసిన కేసులో...నిందితులు అరెస్ట్



రేణిగుంట, మార్చి 17 ప్రభాతవార్త: అంతా కలిసి మద్యం సేవించి ఆ తరువాత ఒక వ్యక్తిని మద్యం షాపు నుండి దూరంగా తీసుకెళ్లి నిలువు దోపిడి చేసిన ఇద్దరు నిందితులను రేణిగుంట అర్బన్ పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకొని ఈ విషయాన్ని విలేకరుల సమావేశంలో వెల్లడించారు. విలేకరుల సమావేశంలో డిఎస్పి శ్రీనివాసరావు మాట్లాడుతూ కడప జిల్లా రాజంపేటకు చెందిన ఎం నరసింహ నాయక్ కరకంబాడి మద్యం షాప్ వద్ద మద్యం సేవిస్తూ ఉండగా రేణిగుంట మండలం అంకమనాయుడు మిట్టకు చెందిన బండి జయచంద్ర, సూళ్లూరుపేట పట్టణానికి చెందిన సాంబ రమేష్ అనే యువకులు అతనితో మాటలు కలిపి అందరూ కలిసి మద్యం సేవించారని తెలిపారు. జయచంద్ర, రమేష్ అతనికి మాయ మాటలు చెప్పి నమ్మించి కట్ట పుట్టాలమ్మ దేవస్థానం వద్దకు తీసుకెళ్తామని చెప్పారన్నారు. వారు అతన్ని అంకమ నాయుడు మిట్ట నిర్జన ప్రదేశానికి తీసుకెళ్లి అతని వద్ద ఉన్న 300 రూపాయల నగదు వెండి చైను, ద్విచక్ర వాహనాన్ని(హీరో స్పెండర్ ప్లస్), రియల్ మీ ఫోన్ తస్కరించి వెళ్లిపోయారన్నారు. బాధితుని ఫిర్యాదు మేరకు రేణిగుంట అర్బన్ పోలీసులు కేసు నమోదు చేసి నిందితుల కోసం వేట ప్రారంభించారు. నిందితులిద్దరిని తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ రవి మనోహరా చారి సూచనలతో డీఎస్పీ శ్రీనివాసరావు పర్యవేక్షణలో అర్బన్ సీఐ జయచంద్ర, ఎస్సై ధర్మారెడ్డి నేతృత్వంలో హెడ్ కానిస్టేబుల్ చలపతి, క్రైమ్ ఐడి పార్టీ సిబ్బంది రాజశేఖర్, శీను, గౌరీ నాయుడు తదితరులు రేణిగుంట మండలం అంకమ నాయుడు మిట్ట రైల్వే గేట్ వద్ద అదుపులోకి తీసుకున్నారు. ఒక్కరోజులో కేసు ఛేదించిన పోలీసులను ఎస్పీ సుబ్బరాయుడు అభినందిస్తూ భవిష్యత్తులో ఇలాంటి కార్యకలాపాలు జరక్కుండా జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించారు

## రోడ్ల మీద కూల్ కూల్ పెయింట్

**-వేసవి కాలం శివభక్తులకు సదుపాయాలు**



శ్రీకాళహస్తి,మార్చి 17 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయానికి వచ్చే భక్తులకు సదుపాయాల కల్పనలో ఇఓ వెంకటేశు ప్రణాళికా బద్దంగా నిర్ణయాలు తీసుకుంటున్నారు. వేసవి ఎండలు దడపుట్టిస్తున్న సందర్భంగా ఆలయానికి వచ్చే మార్గాల్లోపరిపాలనా భవనాల నుంచి జ్ఞాన ప్రసూనాంబ సదన్ వరకు అలాగే సన్నిదివీధిలోని జలవినాయక ఆలయం నుంచి నాల్గవ గేటు వరకు భక్తుల కాళ్ళు కాలకుండా 'కూల్ పెయింట్‌ను' వేస్తున్నారు. ఆలయానికి బస్సుల్లో వచ్చే భక్తులు పట్టణ నడిబొడ్డులోని దేవస్థానం సమాచార కేంద్రం నుంచి తేరువీధిలో బిక్షాల గాలిగోపురం వరకు భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాళ్ళు కాలుతుండగా బొబ్బలెక్కిన కాళ్ళతో ఇబ్బంది పడుతున్నారు. ఆలయాధికారులు ఈ సమస్యను గుర్తించాల్సి ఉంది. బిక్షాల గాలిగోపురం వద్ద చలువ పందిళ్ళు వేయిస్తే బాగుంటుందని భావిస్తున్నారు. అంతేకాక కృష్ణారెడ్డి మండపం వద్ద భక్తులు నిలబడటానికి పందిళ్ళు వేయించాలని పలువురు కోరుతున్నారు. ప్రస్తుతం తిరుపతి వైపు నుంచి వచ్చే బస్సులను అన్నా క్యాంటిన్ వద్ద నిలుపుతున్నారు. అక్కడ నుంచి దిగువ సన్నిధివీధి నుంచి సన్నిధివీధిలోకి వెళ్ళటం జరుగుతుంది. కాబట్టి దేవస్థానం గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.